J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 45 సంచిక : 35 30.1.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## నిధుల మూటలా... ఒట్టి మాటలా..!

# నిర్మలమ్మా.. ఏపీకి ఏమిస్తారు?



- కేంద్ర బడ్జెట్‌పై భారీ ఆశలు
- అమరావతికి, పోలవరానికి నిధులపై ఉత్కంఠ
- ఫిబ్రవరి 1న నిర్మలమ్మ బడ్జెట్

***ము**ంచుతారా.. తేల్చుతారా..? తాయిలాలిస్తారా.. చప్పట్ల చప్పుళ్లతో సరిపెడతారా..? నిధుల వరద పారిస్తారా.. నీళ్లు నములుతారా..? అసలు నిర్మలమ్మ లెక్కేంటి..? నిధుల సంగతేంటి..? కేటాయింపుల కథేంటి..? అంటూ రాష్ట్రవ్యాప్తంగా చర్చోప చర్చలు, ఊహాగానాలు.. జోరందుకుంటున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో కేంద్ర ప్రభుత్వం చేసే జమాఖర్చుల వివరాలను, దేశ ఆదాయ వ్యయాలను పూర్తిస్థాయిలో నిర్ణయించే కేంద్ర ఆర్థిక బడ్జెట్‌కు సమయం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రిగా రికార్డు స్థాయిలో 9వసారి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మాలా సీతారామన్ మన రాష్ట్రానికి ఏమిస్తారు..? ఎంతిస్తారు..? ఏ రూపంలో ఇస్తారో..? ఫిబ్రవరి 1న తేలిపోనుంది.*

దేశంలో ఆదాయ వ్యయాల ఆంతర్యాన్ని, నగదు లెక్కల చిక్కుముడిని, కేటాయింపుల కెపాసిటీని, పంపకాల పద్దును పక్కాగా నిర్ణయించి, ప్రజల ముందుంచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. రాబోవు ఆర్థిక సంవత్సరంలో దేశ ప్రజల ఆదాయం, ఖర్చులకి సంబంధించిన లెక్క తేల్చే కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఫిబ్రవరి 1వ తేదీన ఎన్డీయే ప్రభుత్వం తరపున దేశ ఆర్థిక విధానాన్ని 2026-27 సంవత్సరానికి గాను ఆమె ప్రజలకు వివరించనున్నారు. దీంతో డబుల్ ఇంజిన్ సర్కార్ ఆంధ్రప్రదేశ్‌కి డబ్బులెంతిస్తుంది..? బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏపీపై ఎలా దయచూపుతుందో..? అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఇదే సమయంలో కేంద్రం నుండి పెద్దమొత్తంలో నిధులు రాబట్టేందుకు ఇప్పటికే కూటమి సర్కారు ప్రణాళికలు రూపొందించి కేంద్ర ఆర్థిక మంత్రికి సమర్పించింది. అయితే ఈ విజ్ఞప్తులను నిర్మలమ్మ ఆమోదిస్తారా..? బుట్టదాఖలు చేస్తారా..? అనే అంశంపై మరో రెండు రోజుల్లో స్పష్టత రానుంది.

### ఆంధ్రప్రదేశ్ ఆశిస్తుందేమిటి...?

2026-27 కేంద్ర బడ్జెట్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ప్రజలు భారీ ఆశలే పెట్టుకున్నారు. గత ఏడాది అమరావతికి 15 వేలకోట్ల రుణం ఇప్పించేందుకు కేంద్రం ముందుకురావడం, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు గ్రాంట్‌ను మంజూరు చేయడం, పోలవరానికి సాయం

2లో

## నెల్లూరు కోకాపేటగా మాగుంట లే అవుట్

# ఎకరం 150 కోట్లు!

***ఉ**మ్మడి రాష్ట్ర రాజధాని హైదరాబాదులో 2004 - 2009 మధ్య కాలంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం ఒక్కసారిగా జోరందుకుంది. అప్పట్లో నగరంలోని ప్రధాన ప్రాంతాలలో ఎకరా 25 కోట్ల వరకూ పలికింది. ఆ సందర్భాన్ని ఆధారం చేసుకుని "భూకైలాస్ ఎకరం యాభై కోట్లు" అనే పేరుతో హాస్యరస ప్రధానంగా 2007లో వేణుమాధవ్ హీరోగా ఓ సినిమా కూడా వచ్చింది.*

అయితే, రాష్ట్రం విడిపోయిన తరువాత హైదరాబాదులో అనూహ్యంగా జరిగిన అభివృద్ధి కారణంగా నగర శివార్లలో వున్న కోకాపేటలో కొన్ని భూములని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం వేలం వేస్తే ఎకరా 100కోట్లు పలికింది. ఇక తాజాగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో మరోసారి జరిగిన వేలంలో కోకాపేటలో ఎకరం ధర ఏకంగా 150 కోట్లుకి చేరింది. ప్రస్తుతం నెల్లూరునగరంలో అయ్యప్పగుడి ప్రాంతం నుండి ఆత్మకూరు బస్టాండు వరకు విస్తరించి వున్న మినీ బైపాస్ రోడ్డులో స్థలం ధరలు రోజురోజుకీ అంతకంతగా పెరిగి ఆకాశాన్ని తాకుతున్నాయి. ముఖ్యంగా కొండాయపాళెం కూడలి నుండి శ్రీహరి నగర్ ప్రాంతం వరకు ఎకరా 100 నుండి 150కోట్ల రూపాయల ధర పలుకుతోందంటే అతిశయోక్తి కాదేమో. ఉదాహరణకి అన్నమయ్య కూడలి నుండి టీడీపీ కార్యాలయం వరకు అంకణం ధర 25 నుండి 30 లక్షల వరకూ చేరింది. ఈ ధరలతో అనేక లావాదేవీలు కూడా జరుగుతున్నాయి. 600 అంకణాలైతే ఒక ఎకరా. అంకణం భూమి ధర కేవలం 25లక్షల లెక్కన చూసుకుంటే ఎకరా150కోట్లు. ఇదే ధర ప్రధాన కూడళ్లలో అంకణానికి 30 లక్షలు కూడా పలుకుతోంది. అంటే ఎకరా 180 కోట్లు. తాజాగా కోకాపేటలో జరిగిన వేలంతో పోల్చిచూస్తే నెల్లూరులో వున్న ధర దానికంటే 30 కోట్లు అదనంగా వుంది. అయితే, ఇంత ధర పెరిగినా కొనేవాళ్ళ సంఖ్యే ఎక్కువగా వుంది తప్ప అమ్మే వాళ్ళ సంఖ్య తక్కువగా ఉండడం గమనార్హం.

### ఐదేళ్లలో అనూహ్య మార్పు..!

గడచిన ఐదేళ్ళలో మినీబైపాస్ రోడ్డులో అనూహ్య మార్పులు సంతరించుకున్నాయి. ఊహకందని స్థాయిలో ఇక్కడ అభివృద్ధి పరుగులు పెట్టింది. విశేష సంఖ్యలో వ్యాపార సముదాయాలు ఇక్కడ ఆవిర్భవించాయి. ముఖ్యంగా వస్త్ర దుకాణాలతో పాటు బంగారు అంగళ్ళ నిర్వాహకులు కూడా పోటీ పడి మరీ మినీ బైపాస్‌లో తమ షో రూములు తెరచి వ్యాపార లావాదేవీలని కొనసాగిస్తున్నారు. టీడీపీ కార్యాలయం, శ్రీహరినగర్ ప్రాంతాలలో వివిధ విభాగాల ఆసుపత్రులు వెలిశాయి. ఇంకా కొత్తగా ప్రారంభించడానికి కూడా డాక్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పరిణామాలన్నిటి కారణంగా 2020లో కేవలం 10 లక్షలుగా వున్న అంకణం ధర 2026 నాటికి ఏకంగా 25 నుండి 30 లక్షలకి చేరుకుంది. అంటే ఎకరా 150 కోట్ల నుండి 180 కోట్లన్నమాట. **నెల్లూరా మజాకానా..!**



# మధురగీతాల సృష్టికర్త.. సినీ కవి 'పింగళి'

## వేద విజ్ఞాన వేదిక సభలో ప్రముఖ రచయిత వీవీ రామారావు



వీవీ రామారావుని సత్కరిస్తున్న వేదవిజ్ఞాన వేదిక నిర్వాహకులు

తెలుగు పాట ఎలా రాయాలో, ఎలా రాయకూడదో కూడా తెలిసిన విశిష్ట కవి పింగళి నాగేంద్రరావు అని, తెలుగు సినీ కవిత్రయంలో సముద్రాల, మల్లాది, పింగళి శిఖరసమానులని ప్రముఖ రచయిత-గాయకుడు-ఆకాశవాణి వ్యాఖ్యాత డా.వీవీ రామారావు చెప్పారు. ఈనెల 25న చెన్నైలోని వేదవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారా వాహికలో భాగంగా 169వ ప్రసంగంగా వీవీ రామారావు 'పింగళి సినీ సాహిత్య సౌరభం' అనే అంశంపై అద్భుతంగా ఉపన్యసించి శ్రోతలను ఆకట్టుకున్నారు. చెన్నైలోని కృష్ణాహాల్- ఆంధ్రాక్లబ్‌లో వేద విజ్ఞాన వేదిక అధ్యక్ష కార్యదర్శులు జేకే రెడ్డి, కందనూరు మధు సారధ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రామారావు మాట్లాడుతూ, సినీకవి పింగళి మూడు దశాబ్దాల కాలంలో కేవలం 28 చిత్రాల్లో 250 పాటలకు పైగానే రాశారని, దాదాపూ అవన్నీ అపూర్వమైనవేనని కొనియాడారు. పింగళి రాసిన సంభాషణల్లో కొత్తదనం వెల్లివిరిసేదని, తస్మదీయులు-అస్మదీయులు, సాహసం సేయరా డింభకా.. వంటి అనేక విలక్షణమైన మాటలు ఆయనవేనన్నారు. తెలుగు సినిమా చరిత్రలోనే అత్యంత ప్రసిద్ధి గాంచిన 'శివ శంకరి.. శివానందలహరి' అనే పింగళి గీతం నేటికీ సుప్రసిద్ధమేనన్నారు. శ్రీకృష్ణ సత్య, నీతి నిజాయితీ వంటి ఎన్నో చిత్రాలలోని ఆయన రచనలు బహుళ ప్రజాదరణ పొందాయన్నారు. సినీకవిత్వంలో పింగళి చిరస్మరణీయులని, వర్ధమాన సినీకవులకు ఆయన మార్గదర్శకులన్నారు. అనంతరం వీవీ రామారావును వేదిక నిర్వాహకులు సన్మానించారు.

# జల కళతో.. జలాశయాలు

జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాలు జలకళతో తొణికిసలాడుతున్నాయి. ఇప్పటికే సోమశిల డ్యామ్‌లో 70,941 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈనెల 28న సోమశిల డ్యామ్‌కి ఎగువ ప్రాంతాల నుంచి 3341 క్యూసెక్కుల నీటిప్రవాహం వచ్చినట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. అదేవిధంగా, కండలేరు జలాయశం పూర్తి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ఈనెల 28 నాటికి 59.07 టీఎంసీల నీరు నిల్వ ఉందని, 500 క్యూసెక్కుల నీటి ప్రవాహం జలాశయానికి వస్తోందని వివరించారు.

# మంచాలపల్లిలో 'అక్షర ఆంధ్ర'

అనంతసాగరం మండలంలోని మంచాలపల్లిలో ఈనెల 28న అధికారులు 'అక్షర ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా సచివాలయాల సిబ్బందికి అవగాహన కలిగించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన యాప్‌లో అక్షర వలంటీర్లు, అభ్యాసకుల వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఏకీకృత కుటుంబ సర్వేని పరిశీలించారు.

## ఫిబ్రవరి 1న తిరుపతిలో

# రెడ్డి అనుబంధ మహోత్సవం

భక్త మల్లారెడ్డి గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ తేదీ తిరుపతి నగరంలో రెడ్డి అనుబంధ మహోత్సవాన్ని వైభవంగా జరుపనున్నట్లు సంస్థ నిర్వాహకురాలు శ్రీమతి సుమతిరెడ్డి ఓ ప్రకటన ద్వారా తెలిపారు. గత 8 సంవత్సరాలుగా నిరాటంకంగా ఈ మహోత్సవాలని నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. సంస్థ 9వ వార్షికోత్సవం సందర్భంగా 9వ మహోత్సవాన్ని ఆడంబరంగా జరుపనున్నామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా వున్న రెడ్డి కుటుంబాలని సమైక్య పరచి ఒకే వేదికపైకి తేవాలన్న లక్ష్యమే ఈ మహోత్సవాల ముఖ్య ఉద్దేశమని ఆమె అన్నారు. ప్రతీ సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా ఉదయం 8 నుండి రాత్రి 8గంటల వరకు ఈ మహోత్సవ సంబరం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. తిరుపతిలోని తూకివనం రోడ్డులో వున్న ఆర్.పి.ఆర్. కన్వెన్షన్ హాల్‌లో ఈ వేడుక జరుగనున్నట్లు ప్రకటించారు. "అందరి కోసం మనం – మన కోసం అందరూ" అనే నినాదంతో చేస్తున్న ఈ మహోత్సవంలో రెడ్డి సోదరులు కుటుంబ సమేతంగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సుమతిరెడ్డి పిలుపునిచ్చారు.

# ఫ్రెండ్స్ వాకర్స్.. రిపబ్లిక్ దినోత్సవం

నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 26న రిపబ్లిక్ దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. భారతీయులంతా గర్వపడే రోజు రిపబ్లిక్ డే అంటూ ఆ సంఘం అధ్యక్షులు షేక్ నసీర్‌అహ్మద్, వాకర్స్ 203 గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ పౌరులుగా ప్రతిఒక్కరూ దేశాభ్యున్నతికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి శానంపూడి సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, డా.ఎంఎస్ రెడ్డి, ఏవీపీ రాఘవరెడ్డి, బెజవాడ సునీల్‌రెడ్డి, వినుకొండ వెంకటేశ్వర్లు, పులగల సుబ్బారావు, వినుకొండ సోను, బెల్లం చెంచయ్యనాయుడు, వెంకట్‌రాజు, లక్కాకుల శ్రీనివాసులు, సదానందరెడ్డి, మహేంద్ర శ్రీనివాసులు, కాగొల్లు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీవీరావు వర్ధంతి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

కోళ్ల పరిశ్రమ పితామహుడు స్వర్గీయ బీవీ రావు 30వ వర్ధంతి కార్యక్రమం స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగింది. బెజవాడ సునీల్‌రెడ్డి సహకారంతో 500 ఉడికించిన కోడిగుడ్లను, 203-వాకర్స్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు సౌజన్యంతో అందరికీ పంపిణీ చేశారు. నెక్ సలహాదారు డాక్టర్ కె.బాలస్వామి సహకారంతో పోషకాహారానికి నిలయమైన కోడిగుడ్డు విలువల గురించి తెలియజేసే క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ నసీర్‌అహ్మద్, కార్యదర్శి శానంపూడి సుబ్బరాయుడు, ఆర్‌సీ పలగాటి శ్రీనివాసులురెడ్డి, ఏవీపీ ఏకొల్లు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'నాతో పెట్టుకోకు'.. నవల ఆవిష్కరణ



నవలను ఆవిష్కరిస్తున్న మాడభూషి సంపత్‌కుమార్, సుభద్రాదేవి, గంగిశెట్టి శివకుమార్ తదితరులు

నెల్లూరుకు చెందిన ప్రముఖ నవలా-కథా రచయిత పోట్లూరి సుబ్రహ్మణ్యం రచించిన 'నాతో పెట్టుకోకు' నవలను ఈనెల 27న వెంకటాచలంలోని ప్రాచీన విశిష్ట తెలుగు అధ్యయన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సభకు ప్రొఫెసర్ మాడభూషి సంపత్‌కుమార్ అధ్యక్షత వహించి పోట్లూరి రచనల్లోని విశిష్టతలను తెలియజెప్పారు. పెన్నారచయితల సంఘం అధ్యక్షురాలు గోవిందరాజుల సుభద్రాదేవి సభకు అధ్యక్షత వహించగా, ప్రముఖ కవి డా. పేరిశెట్ల శివకుమార్ ఆ నవలను సమీక్షించారు. రచయిత పోట్లూరి మాట్లాడుతూ స్త్రీ సాధికారతను ఇతివృత్తంగా తీసుకుని ఆ నవలను రచించినట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా కేంద్రసాహిత్య అకాడెమీ బాలసాహిత్య అవార్డుగ్రహీత డా.గంగిశెట్టి శివకుమార్ పాల్గొని నవలా రచయితను అభినందించారు.

# నిర్మలమ్మా.. ఏపీకి ఏమిస్తారు?

(మొదటిపేజీ తరువాయి)

అందిస్తామని ప్రకటించడం చంద్రబాబు సర్కారుకు ప్రజల్లో మైలేజ్ తీసుకొచ్చాయి. అయితే ఈసారి కూడా ఆ స్థాయిలో కేటాయింపులు ఉంటాయా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. పైగా ఈ ఏడాది బడ్జెట్ వేళ అత్యంత కీలకమైన అంశాలు ఎన్నో తెరపై ప్రస్తావనకు వస్తున్నాయి. వాటిలో రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ ఎకనమిక్ రీజియన్‌కు సాయం, పోలవరం – నల్లమల సాగర్ ప్రాజెక్టుకు ఆమోద ముద్ర, విశాఖ రైల్వేజోన్ పనుల వేగవంతం, స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా తీసుకోవాల్సిన చర్యలు వంటివి ఉన్నాయి. వీటి ప్రాతిపదికగానే ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అనేక అభ్యర్థనలను, విజ్ఞప్తులను, వినతులను కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు అందించారు. వాటిలో ముఖ్యంగా ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్న 16వ ఆర్థిక సంఘం సిఫార్సులకు అనుగుణంగా పన్నుల పంపిణీలో రాష్ట్రాలకు వాటా పెంచాలని కోరారు. ఇక తూర్పు తీర రాష్ట్రాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకొచ్చిన మిషన్ పూర్వోదయ పథకం నిధులను మరింతగా పెంచి, వాటిని రాష్ట్రాల స్థానిక అవసరాల మేరకు ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించాలని విన్నవించారు. ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లోని విద్య, వైద్యం, వ్యవసాయం, జీవనోపాధిని పెంచేందుకు కేంద్రం విరివిగా నిధులు కేటాయించాలని కోరారు. ఇక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న విధంగా నవ్యాంధ్ర ప్రదేశ్‌లోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్యాకేజీ అందించాలని, తద్వారా ఆర్థిక కష్టాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు కొంత ఉపశమనం లభిస్తుందని తెలియజేశారు. ముఖ్యంగా రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 41వేల కోట్లతో రూపొందించిన ప్రణాళికలను సత్వరం ఆమోదించాలని పయ్యావుల నిర్మలా సీతారామన్‌కు విన్నవించారు.

### అమరావతి, పోలవరంతో పాటూ నల్లమల సాగర్...!

ఇక రెండో దశ భూసేకరణ పనులు మొదలైన నేపథ్యంలో రాజధాని అమరావతికి హడ్కో ద్వారా మరింత రుణాన్ని ఇప్పించేందుకు కేంద్రం చొరవ చూపాలని ఏపీ ప్రభుత్వం కోరుతోంది. కనీసం ఈ బడ్జెట్‌లో రూ.20వేల కోట్ల వరకు రుణాలు ఇప్పించాలని అభ్యర్థిస్తోంది. అలాగే పోలవరం ప్రాజెక్టు సకాలంలో పూర్తయ్యేందుకు సహకరించాలని, ముఖ్యంగా ప్రతిపాదిత పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుకు తెలంగాణ అడ్డుపడుతున్న నేపథ్యంలో అనుమతులను త్వరగా మంజూరు చేయాలని విన్నవిస్తోంది. పోలవరం-నల్లమల సాగర్ ద్వారా గోదావరి నదిలో వృథాగా పోతూ సముద్రంలో కలుస్తున్న 200 టీఎంసీలను ఆంధ్రప్రదేశ్‌లోని కరువు ప్రాంతాలకు అందించే అవకాశం కలుగుతుందని చంద్రబాబు ప్రభుత్వం చెబుతోంది. దీన్ని నిర్మలా సీతారామన్ ఎంత వరకు నెరవేరుస్తారో చూడాల్సి ఉంది.

అలాగే విజయవాడ – విశాఖపట్నం మెట్రోరైల్ ప్రాజెక్టుకు అంకురార్పణ చేయడం, నెల్లూరులో బీపీసీఎల్ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు ద్వారా రామాయపట్నం పోర్టు సమీపంలో రూ.లక్ష కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రో కెమికల్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి చొరవ చూపడం, రాష్ట్ర మూలధన వ్యయాన్ని స్థిరీకరించడం కోసం వడ్డీలేని రుణాలను మరింతగా ఏపీకి అందించడం వంటివి కూడా ఈసారి కేంద్ర బడ్జెట్‌లో తప్పక ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తోంది. ఇక తిరుపతి జిల్లాలోని దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, నేషనల్ మెగా షిప్ బిల్డింగ్ క్లస్టర్ వంటి వాటికి కూడా ఆమోదం తెలిపాలని కోరుతోంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఏపీ ప్రజలకు ఎలాంటి భరోసా కల్పిస్తుందో, ఎన్ని నిధులు కేటాయిస్తుందో..? అన్నది చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా మన పొరుగింటి ఆడపడచు, తెలుగింటి కోడలు నిర్మలమ్మ, అంకెలగారడీతో ఆంధ్రులను మాయ చేస్తారో..? భారీగా నిధులిచ్చి ఏపీని ప్రోత్సహిస్తారో..? వేచి చూడాలి...!

### విశాఖ రూపురేఖలు మార్చేందుకు..!

ఈసారి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరపున అందిన వినతుల్లో అత్యంత ముఖ్యమైనది విశాఖ ఎకనమిక్ రీజియన్‌కు ఆర్థిక కేటాయింపుల అంశం. ఈ ఎకనమిక్ రీజియన్ ద్వారా విశాఖ రూపురేఖలు మారిపోతాయని, రాష్ట్రంలోని ఉత్తర తీర ప్రాంత జిల్లాల్లో ఆర్థికాభివృద్ధి జోరందుకుంటుందని కూటమి సర్కారు భావిస్తోంది. 2032 నాటికి విశాఖ ఎకనమిక్ రీజియన్ ద్వారా 120 బిలియన్ డాలర్ల ఆర్థిక కార్యాకలాపాలు నిర్వహించాలని ప్రణాళికలు రచిస్తోంది. తద్వారా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో 20 లక్షలు నుంచి 24 లక్షల వరకు కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టించాలని అంచనా వేస్తోంది. ఈనేపథ్యంలో తక్షణ అవసరంగా విశాఖ ఎకనమిక్ రీజియన్‌కు మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.5 వేల కోట్లు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించాలని కేంద్రాన్ని కోరుతోంది. దీన్ని ఎంతవరకు నిర్మలా సీతారామన్ నెరవేరుస్తారో..? చూడాల్సి ఉంది. అలాగే విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం, రైల్వేజోన్ పనులను వాయువేగంతో పూర్తి చేసేందుకు కూడా ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రాన్ని అడుగుతోంది.

# అంతర్జాతీయ ప్రమాణాలతో.. మునిసిపల్ స్కూళ్లు!

## మంత్రి నారాయణ



బీవీఎస్ స్కూల్ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారాయణ

పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో..అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందుబాటులో ఉండేవిధంగా నెల్లూరులోని ప్రభుత్వ విద్యాలయాలను తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామని రాష్ట్ర పురపాలకమంత్రి డా.పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నగరంలోని పలు ప్రాంతాలను సందర్శించి పాఠశాలల తీరును పరిశీలించారు. బీవీఎస్ స్కూల్‌ను ఆయన పరిశీలించి మాట్లాడుతూ, కేవలం భవనాలే కాకుండా, అత్యాధునిక ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్ రూమ్‌లతో బీవీఎస్ పాఠశాలను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని 42, 43, 48 డివిజన్లలో పాఠశాలల కొరతను తీర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. సుమారు 5ఎకరాల స్థలంలో కొత్త పాఠశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, అందుకు ఎంపీ సీఎం రమేష్ సుమారు 20 కోట్ల రూపాయలను సాయంగా అందించేందుకు ముందుకు రావడం విశేషమని కూడా మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. నగరంలో 15 మున్సిపల్ హైస్కూల్స్‌ని పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి, అంతర్జాతీయ ప్రమాణాలతోవాటిని తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇప్పటికే దాదాపు రూ.15కోట్లతో కేవలం నాలుగు నెలల రికార్డు కాలంలో వీఆర్ స్కూల్‌ను పునర్నిర్మించామన్నారు. ఈ కార్యక్రమాల్లో దాతల సహకారం మరువలేనిదన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, డి.ఎస్.రెడ్డి వంటి ప్రముఖులు మరియు జిగ్మా, రెడ్డి ల్యాబ్స్ వంటి కార్పొరేట్ సంస్థలు తమ సీఎస్ఆర్ నిధులతో ఈ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారని ఆయన చెప్పారు.

### టిడ్కో ఇళ్లను త్వరితగతిన పూర్తిచేయాలి :

అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్ల పనుల్లో వేగం పెంచాలని మంత్రి డా.పొంగూరు నారాయణ సూచించారు. జూన్ నాటికి పనులు పూర్తిచేసి అర్హత ఉన్న లబ్ధిదారులకు ఇళ్ళు అందచేయాలని ఆదేశించారు. ఇటీవల ఆయన నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలతో కలసి జిల్లాలోని అభివృద్ధిని శాఖల వారీగా సంబంధిత అధికారులతో సమీక్షించారు.. దొంతాలి డంపింగ్ యార్డులో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు ఉన్న అటవీశాఖ అడ్డంకులపై డీఎఫ్ఓతో చర్చించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజితా వేజెండ్ల, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ అనూషా, కమిషనర్ నందన్, డీఎఫ్ఓ మహబూబ్‌బాషా, అధికారులు పాల్గొన్నారు.

# భక్తుల కోసం తొలిసారిగా.. టెంపుల్ కారవాన్

## • ప్రారంభించిన మంత్రి ఆనం

భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలతో నూతనంగా రూపొందించిన ప్రత్యేక కారవాన్ వాహనాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈనెల 26న నెల్లూరులోని తమ క్యాంపు కార్యాలయంలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఈ వాహనాన్ని ఆయన పరిశీలించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా రూపొందించిన ఈ కారవాన్ వాహనం భక్తులకు బాగా ఉపయోగపడుతుందని ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ వాహనాన్ని ఏర్పాటుచేసిన నెల్లూరువాసి వై.శ్రీనివాసరెడ్డిని మంత్రి ఆనం అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా టూరిజంశాఖ ఆధ్వర్యంలో ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ కారవాన్‌లను ప్రారంభించి పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు భక్తులకు వెసులుబాటు కల్పించనున్నట్లు మంత్రి ఆనం తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టెంపుల్ టూరిజంను అభివృద్ధి చేయాలని,




'టెంపుల్ కారవాన్'ను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను టూరిజం సర్క్యూట్‌లుగా అభివృద్ధిచేసేందుకు చర్యలు చేపట్టారని అందులో భాగంగా రాష్ట్రంలో టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో తానను, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆర్అండ్‌బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిలతో ఒక సబ్‌కమిటీని ముఖ్యమంత్రి నియమించారని తెలిపారు. రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాల సమాచారాన్ని, వసతి సౌకర్యాలను అన్నీ కూడా భక్తులు సులభంగా అర్ధమయ్యేలా ఒక వెబ్‌సైట్‌లో పెట్టి, టూరిజం సర్క్యూట్‌లను ఏర్పాటుచేసి పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం దృఢసంకల్పంతో పనిచేస్తుందన్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి ఉషశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో.. సుందరంగా 'నగర వనం'



నగర వన ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి ఆనం

ఆత్మకూరు మణి హారంగా నగరవనాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తెలిపారు. ఇటీవల ఆయన ఆత్మకూరు ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని అటవీశాఖ భూముల్లో ఏర్పాటు చేయనున్న నగరవన ప్రాంతాన్ని పరిశీలించారు. నగరవన ఏర్పాటుపై అటవీ శాఖ అధికారులతో మంత్రి చర్చించారు. ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం రూ.1.40 కోట్ల నిధులను మంజూరు చేయగా, ఇప్పటికే రూ.98 లక్షలు విడుదల చేసినట్లు వెల్లడించారు. తొలి విడతలో సుమారు 100 ఎకరాల భూముల్లో అవసరమైన మేర భూమిని చదును చేసి, వాకింగ్ ట్రాక్, క్రీడా పరికరాల ఏర్పాటు, స్నేక్ పార్క్, కాఫీ పార్క్, సోలార్ లైటింగ్ వ్యవస్థ, విస్తృత ప్లాంటేషన్ వంటి ఆహ్లాదకరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వివరించారు. నగరవనంలో ఆయుర్వేద ఔషధ విలువలు గల మొక్కలను బ్లాకులుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ నగరవనం ద్వారా ఆత్మకూరు పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన ప్రాణవాయువు అందిస్తూ, ప్రశాంత వాతావరణంలో సేదతీరే అవకాశాన్ని కల్పించనున్నట్లు మంత్రి చెప్పారు. డిఎఫ్ఓ మహబూబ్ బాషా, ఆర్డీవో పావని, తాసిల్దార్ పద్మజ, కమిషనర్ గంగాప్రసాద్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్య భద్రతకు పెద్దపీట

ఆత్మకూరులోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఈనెల 25న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు నియోజక వర్గ పరిధిలోని 67 కుటుంబాలకు రూ. 39 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆత్మకూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 640 మందికి రూ.6.18కోట్లు మంజూరు చేసి బాధిత కుటుంబాలకు అండగా నిలిచినట్లు చెప్పారు. పేదల సంక్షేమంతో పాటు ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి నేతృత్వంలోని తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.

## సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో

# యువగళం విజయోత్సవ ర్యాలీ



టీడీపీ నాయకులతో కలిసి మోటార్ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనయుడు, సర్వేపల్లి టీడీపీ సమన్వయ కర్త సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి ఇటీవల 'యువగళం' విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొని కార్యకర్తల్లో ఆయన ఉత్సాహం నింపారు. తెలుగుదేశం పార్టీ యువనేత నారా లోకేష్‌బాబు 3132 కిలోమీటర్ల యువగళం పాదయాత్రకు గుర్తుగా 3132 సైకిళ్లను పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఆమేరకు ఇటీవల ఆయన విరువూరు గ్రామంలో పలువురు విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో మార్చి 29 నాటికి సైకిళ్ల పంపిణీ పూర్తిచేస్తామన్నారు. లోకేష్ బాబు యువగళం పాదయాత్ర చేపట్టి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా తొలుత పొదలకూరు మండలంలో సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పొదలకూరు నుంచి తాటిపర్తి, మహ్మదాపురం మీదుగా విరువూరు వరకు సాగిన బైక్ ర్యాలీ, విరువూరులో సచివాలయం నుంచి జెడ్పీ హైస్కూలు వరకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి చేసిన పాదయాత్ర ఆయా గ్రామాల ప్రజలను బాగా ఆకట్టుకున్నాయి.

# అభివృద్ధిలో..నెల్లూరు రూరల్..ఒక మోడల్!

## • గిరిధర్‌రెడ్డి సారధ్యంలో 27 కోట్లతో..240 అభివృద్ధి పనులు

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి సారధ్యంలో రూరల్‌లో ఇటీవలి కాలంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతుండడం తెలిసిందే. తమ అన్న శ్రీధర్‌రెడ్డి వైద్యచికిత్స కోసం వెళ్లివున్నా, ఆ స్థానంలో గిరిధర్‌రెడ్డి అన్న చెప్పిన ప్రతి కార్యక్రమాన్ని భుజాన వేసుకుని ప్రజలకు మౌలికసదుపాయాలు కల్పిస్తుండడం విశేషం. ఈ నేపథ్యంలో ఒకేసారి 27కోట్ల రూపాయల వ్యయంతో 240 అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించడం ప్రజలందరి ప్రశంసలందుకుంటోంది. అభివృద్ధి పనుల్లో నెల్లూరు రూరల్ ఒక మోడల్‌గా ఉంటోంది. నగర ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్‌తో కలిసి ఈ నెల 24న ఆయన 33వ డివిజన్, తాతయ్య బడి వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపన



స్థానిక ప్రజలే ముఖ్యఅతిథులుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

చేశారు. గిరిధర్‌రెడ్డితో పాటు మునిసిపల్ కమీషనర్ వై.ఓ.నందన్, టీడీపీ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ, గతంలో 42 కోట్లతో 339 అభివృద్ధి పనులను ఏవిధంగా పూర్తి చేశామో, ఇప్పుడు కూడా 27కోట్లతో 240 అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు.

లాయర్
జనవరి 30, 2026

# మాటలకే పరిమితమైపోతున్న..పట్టణాల అభివృద్ధి!

మన రాష్ట్రంలోనే కాదు, దేశవ్యాప్తంగా అనేక పట్టణాలు ఎంతోకాలంగా సమస్యల వలయంలోనే విలవిలలాడుతున్నాయి. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లు, పేరుకు గొప్ప పట్టణాలుగా అనిపిస్తున్నా కనీస సదుపాయాలు కూడా కొరతగానే ఉంటున్నాయి. పట్టణాల్లో నివసించే అధికశాతం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అవసరమైన కనీస మౌలిక వసతులు కూడా ఉండడం లేదు. దీంతో పట్టణవాసం కష్టాల నివాసంగా మారిపోతోంది. జనాభా పెరిగిపోతున్నకొద్దీ పట్టణాలు మరింతగా క్రిక్కిరిసిపోతున్నాయి. గతంలో కంటే వాహనాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిపోయింది. కాలుష్యం పెరిగిపోయి నగరజీవనం అస్తవ్యస్థంగా మారుతోంది. ముఖ్యంగా పట్టణాల్లో ఎక్కడో ప్రధాన ప్రాంతాల్లో తప్ప రోడ్ల వసతులు నామమాత్రంగానే ఉంటున్నాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పెరిగిపోతున్నా రోడ్ల అభివృద్ధికి తగు నిధులు లేక, వాటి స్థితిగతులను ఎవరూ పట్టించుకోవడం లేదు. చిన్న వర్షానికే రోడ్లు నీటిగుంటలుగా మారుతూ ప్రయాణం నరకయాతన అవుతున్న ప్రాంతాలు మన పట్టణాల్లో లెక్కలేనన్ని ఉంటున్నాయి. పట్టణ వీధులు, కూడలి ప్రాంతాలు మురికి కూపాలుగా తయారవుతున్నాయి. ఎప్పటికప్పుడు వాటిని తొలగించి పరిశుభ్రం చేసేందుకు తగ్గ అధునాతన యంత్రాలు కానీ, యంత్రాంగం కానీ నేటికీ మన పట్టణాల్లో పూర్తిస్థాయిలో లేకపోవడం ఒక పెద్ద లోపం. ఎక్కడ స్థలం కనిపిస్తే.. అక్కడ కబ్జాలు చేయడం సర్వసాధారణమైపోయింది. చివరికి కాలువ కట్టలను కూడా ఆక్రమించుకుంటుండడంతో వర్షాకాలంలో నీటిపారుదలకు వీలుకాక, సమీప ప్రాంతాలన్నీ మునకకు గురవుతూనే ఉన్నాయి. వర్షపునీటి ప్రవాహాలు వెళ్లే మార్గాలు ఎక్కడికక్కడ మూసుకుపోవడంతో పట్టణాల్లోని అనేక ప్రాంతాలు జలమయం కావడం, కుండపోత వానలో లేదా వరదలో వచ్చినప్పుడు అవి ప్రమాదకరంగా మారుతుండడం ఏటా జరుగుతోందని, అలాంటి ప్రాంతాలున్న పట్టణాలు మనదేశంలో సుమారు 5వేలకి పైగానే ఉన్నాయని నిపుణుల గణాంకాలు చెప్తున్నాయి. పట్టణ పురపాలక వ్యవస్థలు, నగర పాలక యంత్రాంగాలు, సిబ్బంది బోలెడంతమంది ఉన్నా, అలాంటి దీర్ఘకాల సమస్యల పరిష్కారాన్ని నిర్లక్ష్యం చేస్తుండడంతో ఏళ్లతరబడిగా పట్టణాలకు ముంపు సమస్యలు వస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో వర్షాకాలాల్లో పట్టణాలు మురుగునీటి గుంటలను తలపిస్తుంటాయి. జలవనరులు కలుషితం కావడంతో దోమలు పెరిగి వ్యాధులు విజృంభిస్తుంటాయి. చెత్తాచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో మురుగుకాలువలు మునిగిపోయి ఉండడం పట్టణాల్లో సర్వత్రా మనం చూస్తున్నదే. సైడు కాలువల్లోని మురుగునీరు వెళ్లే దారి లేక, రోడ్లమీద ప్రవహిస్తూ అంతా భరించలేని దుర్వాసన వస్తుండడం పట్టణ ప్రజలు నిత్యం అనుభవిస్తున్నదే. దేశంలోని అనేక పట్టణాల్లో ఈ దుస్థితి ఎంతోకాలం నుంచి ఉన్నా ప్రభుత్వాలు కానీ, పాలకులు కానీ పట్టించుకోవడం లేదు. పట్టణాల పరిశుభ్రతకు అవసరమైన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలు లేకపోవడం, మరికొన్ని పట్టణాల్లో మంచినీటి కొరత వంటి సమస్యలు ప్రజలను బాధిస్తూనే ఉన్నా, ఆయా ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉండడం లేదు. ప్రధానమైన ప్రాంతాలే ఇలా వసతుల లేమితో అల్లాడుతుంటే, ఇక శివారు ప్రాంతాల దుస్థితి మాటల్లో వర్ణించలేనంత దయనీయంగా ఉంటోంది. మురుగునీటిని శుద్ధి చేయడం ద్వారా, వ్యర్థాలను ఉపయోగించి రీసైక్లింగ్ చేయించడం ద్వారా ఎంతో ప్రయోజనం ఉంటుందనే సంగతి అందరికీ తెలిసిందే కానీ, అందుకు తగ్గ సాంకేతిక యంత్రాంగం ఇంకా పట్టణాలకి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడం లేదు. కేంద్రప్రభుత్వం, కేంద్రపట్టణాభివృద్ధిశాఖ ఇకనైనా రాష్ట్రాల్లోని సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తగ్గ ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తే తప్ప ఈ దుస్థితి మారదు. అన్నిటికీ మించి పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్‌లో మరింత పుష్కలంగా నిధులు కేటాయించి, ప్రత్యేక అధికార బృందాలతో సమస్యల పరిష్కారానికి నడుం బిగించాలి. స్వచ్ఛభారత్ వంటి పథకాలను మరింత పటిష్టంగా అమలుచేసి, పచ్చదనం పరిరక్షణకు, పరిశుభ్రతను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి. సరైన పర్యవేక్షణాధికారులతో పథకాలను అమలుచేసినప్పుడే ఆచరణలో అవి సత్ఫలితాలనిస్తాయి. ఆ దిశలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పయనించాలి. అన్ని వసతులతో పట్టణాలను సుందరంగా తీర్చిదిద్దాలి. అప్పుడే పట్టణ జీవితాలు కొంతమేరకైనా మెరుగుపడతాయి.

# వీసాల విషయంలో.. ట్రంప్ నిర్ణయాన్ని స్వాగతిద్దాం!

హెచ్-1బి వీసాల మంజూరు, ఇమ్మిగ్రేషన్ తదితర విషయాలలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న కొత్త నిర్ణయాలు నా దృష్టిలో చాలా మంచివి. ఎందుకంటే, ఆయన విధించిన షరతులతో అమెరికాలోని ఐటీ రంగ నిపుణులు స్వదేశ బాట పడుతుండడం విశేషం! ఈ క్రమంలో తమ సొంత దేశాలకి తిరిగి వస్తున్న వారి సంఖ్య ఇప్పటికే 40% పెరిగిందని ఐటీ నిపుణులు చెప్తున్నారు. ఈ పరిణామాలతో మన దేశ నైపుణ్యత ఇప్పుడు మన దగ్గరే ఉండిపోతుంది. ప్రతిభావంతులైన భారతీయులు తిరిగి మన దేశానికి వచ్చేసి ఇక్కడే ఉద్యోగాల్లో స్థిరపడడం మంచి పరిణామం కదా..! కఠినమైన హెచ్-1బీ వీసా నిబంధనలు, లక్ష డాలర్లకు పెరిగిన ఫీజు వంటి కారణాల వలన అమెరికాకు వచ్చే విదేశీ సాంకేతిక నిపుణుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయిందని అనేక వార్తా కథనాలు వెల్లడి చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులలో అమెరికన్ వీసాలపై ఆధారపడే వారి సంఖ్య కూడా భారీగా తగ్గుతుంది. ట్రంప్ తీసుకుంటున్న కఠిన నిర్ణయాలని చాలామంది వ్యతిరేకిస్తున్నా.. ఒక విధంగా ఆ నిర్ణయాల వలన మనకి మంచే జరుగుతుందన్న విషయాన్ని మేధావులు గ్రహించాలి. ట్రంప్ నిర్ణయాలని మనం స్వాగతించాలి. – యం. చంద్రమౌళి, కొత్త ఢిల్లీ.

## గ్రంథాలయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి!

రాష్ట్రంలో గ్రంథాలయాల దుర్దశని 'సత్యపీఠం' ద్వారా గతవారం 'లాయర్'లో స్పష్టంగా వివరించారు. వాటి దుస్థితిని ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు. గ్రంథాలయాల ఆధునీకరణపై ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ పెట్టాలి. శిథిలమైపోతున్న గ్రంథాలయాల భవనాలతో పాటు అతి పురాతనమైన, అత్యంత విలువైన మన సాహితీ సంపద కూడా కనుమరుగైపోతుందన్న వాస్తవాన్ని ప్రభుత్వం గ్రహించాలి.

జిల్లాలో పురాతన ఆలయాలకు కొత్త కళ తీసుకురావడంలో రాష్ట్ర దేవాదాయ మంత్రివర్యులు ఆనం రామనారాయణరెడ్డి గారి కృషి శ్లాఘనీయం. పాత దేవాలయాలకు నిధుల కేటాయింపు, సదరు ఆలయాల పర్యవేక్షణ కోసం మంత్రి చూపిస్తున్న చొరవ ముదావహం. ప్రజల సమస్యలపై సమర్థవంతంగా స్పందిస్తున్న 'లాయర్'కి, మంత్రి రామనారాయణరెడ్డి గారికి నా అభివందనాలు...!

సీ. ఆర్. విశ్వేశ్వరరావు - మాజీ ఉపకులపతి, హైదరాబాదు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## అభినందనీయులు కోటంరెడ్డి బ్రదర్స్!

నెల్లూరురూరల్ నియోజకవర్గంలో ప్రజల అవసరాలని గుర్తించి, ఒక ప్రణాళికాబద్ధమైన వ్యూహాన్ని రచించుకుని చిన్న చిన్న ఇబ్బందులకి కూడా పరిష్కారం చూపుతున్న శాసనసభ్యుడిగా శ్రీధరరెడ్డి ప్రజాదరణ పొందుతున్నారు. అన్నకి తోడుగా తమ్ముడు గిరిధర్‌రెడ్డి కూడా నిత్యం ప్రజల మధ్యే వుండి తమ అన్న దృష్టికి వచ్చిన సమస్యలన్నిటిని సమర్థవంతంగా తీర్చడంలో నిరంతరం శ్రమిస్తున్నారు. "అన్నబాటలో అన్నీ తానై..." అని గత వారం మన 'లాయర్'లో వచ్చిన వార్త అక్షరసత్యం. నెల్లూరురూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్న కోటంరెడ్డి బ్రదర్స్ అభినందనీయులు. – వీ.సీ. చౌదరి, మాగుంట లే అవుట్, నెల్లూరు.

సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 127

# ప్రాణాలను తోడేస్తున్న క్యాన్సర్ మహమ్మారి!

ఎవరికైనా క్యాన్సర్ వచ్చిందని వింటేనే, 'బాబోయ్ క్యాన్సరా!' అంటూ భయపడిపోతుంటాం. కానీ, ఇప్పుడా వ్యాధి సర్వసాధారణమైపోయింది. విస్తృత స్థాయిలో క్యాన్సర్ జనం ప్రాణాలని తోడేస్తోంది. జీవనశైలిలో మార్పు, కల్తీలు, కాలుష్యం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోకపోవడం తదితర కారణాలతో పాటు, పొగాకు, గుట్కా వాడకం వంటి దురలవాట్లు క్యాన్సర్‌కి దారితీస్తున్నాయి. ప్రాణాంతకమైన ఈ వ్యాధి పట్ల సరైన అవగాహన లేకపోవడం, ముందస్తు ఆరోగ్యపరీక్షలు చేసుకోకపోవడం వల్ల ఏటా ఈ క్యాన్సర్ మరణాలు పెరుగుతూనే ఉన్నాయి. ఒక్క మనదేశంలోనే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా అధిక సంఖ్యలో ప్రజలు ఈ వ్యాధి బారినపడుతున్నారు. వైద్యవిజ్ఞానం శరవేగంగా పెరిగిన నేటి కాలంలోనూ ఈ వ్యాధికి లక్షలాది మంది ప్రాణాలు పోగొట్టుకుంటుండడం బాధాకరం.

### ప్రపంచంలో ఏటా కోటి మంది బలి...

ఇటీవలి కాలంలో క్యాన్సర్ వ్యాధి ప్రపంచాన్ని వణికిస్తోంది. క్యాన్సర్ కేసులు భారీగా పెరిగిపోతున్నాయని, ఏటా సుమారు కోటి మంది మృత్యువాత పడుతున్నారని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. 2050 నాటికి ఈ సంఖ్య మరింత భారీగా పెరుగుతుందని, ఏటా 3 కోట్లమంది ఈ వ్యాధికి గురికావచ్చని, మరణాల సంఖ్య కూడా 1.8 కోట్ల మందికి దాటవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రపంచానికే పెనుముప్పుగా తయారవుతున్న ఈ క్యాన్సర్ వ్యాధిని నియంత్రించేందుకు వైద్యనిపుణులు ఎంతగా కృషిచేస్తున్నా, ఆశించినస్థాయిలో అవి తగ్గడమే లేదు.

మనదేశంలో కూడా గత పదేళ్ళ గణాంకాలు పరిశీలిస్తే 2015లో 13.9 లక్షల వరకు ఉన్న క్యాన్సర్ కేసులు, 2024 ఆఖరుకల్లా 15.3 లక్షలకు పెరిగాయి. మరణాల సంఖ్య 6.8 లక్షల నుంచి 8.7 లక్షలకు పైగానే పెరగడం గమనార్హం. క్యాన్సర్ వ్యాధి తీవ్రతకు ఇవన్నీ ప్రత్యక్ష నిదర్శనాలు. 2015 నుంచి చూసినా, గత పదేళ్లకాలంలో దేశంలో క్యాన్సర్ కేసులు 13.9 లక్షల నుంచి 15 లక్షలకు పైగానే వున్నాయంటే అతిశయోక్తి కాదు. మరణాలు కూడా 6.8 లక్షల నుంచి 8.7 లక్షలకు చేరుకున్నాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మానవాళికి ఒక పెద్ద ప్రమాదంగా పరిణమిస్తున్న ఈ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన ఎంతో ముఖ్యమంటున్నారు నిపుణులు. ఎప్పటికప్పుడు ఆరోగ్యపరీక్షల ద్వారా ముందస్తుగానే ఈ వ్యాధిని గుర్తించి తగు చికిత్సలు చేయించుకుంటే, దాని బారినుంచి బయటపడవచ్చని సూచిస్తున్నారు.

### జీవనశైలి మార్పులతో... క్యాన్సర్ విజృంభణ :

నేటి ఆధునిక కాలంలో, యాంత్రిక జీవితంలో జీవనశైలి పూర్తిగా మారి పోయింది. పూర్వకాలంలో లాగా ఆరోగ్యకర ఆహారం, శారీరక శ్రమ, మంచి అలవాట్లు ఇప్పుడు కనుమరుగైపోయాయి. దీంతో, మన ఆరోగ్యాన్ని కాటేసేందుకు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు పొంచివుంటున్నాయి. గతంలో ఏ కొద్దిమందికో ఈ వ్యాధి వస్తుండేది. ఇప్పుడలా కాదు. ఎక్కడ చూసినా క్యాన్సర్ కేసులే కనిపిస్తు న్నాయి. అనేకమంది తెలిసి తెలిసీ, కేవలం నిర్లక్ష్యంతో ఈ వ్యాధిని కొని తెచ్చుకుంటూ ఉండడం విచారకరం. క్యాన్సర్‌కి ప్రధాన కారణాల్లో కొన్నైన పొగాకు, గుట్కా వంటి వాడకం వద్దంటూ ఆరోగ్యసంస్థలు నెత్తీనోరూ బాదుకుంటున్నా, వాటి ఉత్పత్తులతో పాటు వాడకం కూడా నానాటికీ పెరిగిపోతూనే ఉండడం విచారకరం. సిగరెట్‌లు తాగడం, గుట్కాలు నమలడం, పొగాకును నమిలి తినడం వంటి దురలవాట్ల వల్ల 35 శాతం క్యాన్సర్ వ్యాధులు వస్తున్నాయని నిపుణులు చెప్తున్నారు.

అదేవిధంగా, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం వల్ల, ఆరోగ్యకరమైన ఆహారాన్ని వదిలేసి పిజ్జాలు, బర్గర్లు వంటివి తినడం వల్ల కూడా ఈ వ్యాధులు సంక్రమిస్తున్నాయి. అందులోనూ ఏ వస్తువు చూసినా కల్తీయే. ఎక్కడ చూసినా కాలుష్య వాతావరణమే. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత అన్నది బాగా లోపిస్తోంది. దీంతో నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారపు క్యాన్సర్, పెద్దపేగు క్యాన్సర్, జీర్ణాశయ క్యాన్సర్ బ్రెస్ట్ క్యాన్సర్, బ్లడ్ క్యాన్సర్ ఇలా అనేకరకాల క్యాన్సర్ వ్యాధులు ప్రజల ప్రాణాలని తోడేస్తున్నాయి. ఒక్క గర్భాశయ క్యాన్సర్‌తోనే మనదేశంలో ఏటా లక్షలాది మంది మహిళలు నరకం చవిచూస్తున్నారని, ప్రతి 8 నిమిషాలకీ ఒకరు మరణిస్తున్నారని కూడా నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇకనైనా ప్రభుత్వాలు ఈ క్యాన్సర్ వ్యాధుల పట్ల ప్రజలకి పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించాలి. అంతేకాదు, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను మానవతా హృదయంతో ఆదుకోవాలి. ఎంతో ఖరీదైన ఈ వైద్యాన్ని అన్ని రకాల ఆసుపత్రుల్లోనూ తక్కువ వ్యయంతోనే నయం చేసుకునేవిధంగా చర్యలు తీసుకోవాలి. మందులను కూడా పేదలకు ఉచితంగా, లేదా రాయితీతో అందించాలి.

ఫిబ్రవరి 4, ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం వంటి ప్రత్యేక సందర్భాలలోనైనా క్యాన్సర్ వ్యాధిపై విస్తృత అవగాహన కల్పించాలి. ఆ రోజు క్యాన్సర్‌కి సంబంధించిన ఆరోగ్యపరీక్షలను అందరికీ ఉచితంగా నిర్వహించేలా క్యాంపులు నిర్వహించాలి. ముందుజాగ్రత్తతో క్యాన్సర్ ముప్పునుంచి తప్పుకునే విధంగా దేశంలోని అన్ని ప్రాంతాల్లోని వారికి సరైన అవగాహన కల్పిస్తే తప్ప, ఈ వ్యాధుల బాధల నుంచి ప్రజలకి విముక్తి ఉండదు. "ఆరోగ్యమే మహా భాగ్యం " అన్న నినాదాన్ని బలంగా ప్రజలలోకి తీసుకెళ్లి, క్యాన్సర్ మహమ్మారి వంటి ప్రమాదకర వ్యాధుల పట్ల ప్రజలని చైతన్యపరచాలి..!

- రాజశ్రీ

# అంబరాన్నంటే సంబరంగా.. గణతంత్ర వేడుకలు

## • అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శనలు



జెండా వందనం చేస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల తదితర అధికారులు

జనవరి 26న నెల్లూరు పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అంబరాన్నంటే సంబరంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ డాక్టర్ అజితా వేజెండ్ల, జేసీ మొగిలి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ నందన్, జిల్లాస్థాయి అధికారుల నేతృత్వంలో జిల్లా అధికారయంత్రాంగం ఈ వేడుకలను ఎంతో ఉత్సాహంగా నిర్వహించింది. స్వాతంత్ర్యయోధులను స్మరించుకుంటూ అధికారులు ఈ ఏర్పాట్లను భారీ స్థాయిలో చేశారు. జెండా వందనం, పోలీసుల కవాతు, విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ సాగిన ప్రభుత్వ శాఖల శకటాలతో పాటు, ఈసారి 'స్వర్ణకారుల శకటం' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్తమ సేవలందిస్తున్న వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా ప్రగతి నివేదికను వివరించారు. పలుశాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధిని ఆయన ప్రస్తావించారు. ముఖ్యంగా వ్యవసాయం, జలవనరులు, పరిశ్రమల రంగాల్లోని అభివృద్ధిని వివరించారు. ఈ రబీ సీజన్‌లో 3,14,000 ఎకరాలలో వరి పంట, మిగిలిన విస్తీర్ణములో ఇతర పంటలు సాగు చేయడం జరుగుతోందన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రూ.6.39 కోట్ల సబ్సిడీతో 12,948 క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలను 28,685 మంది రైతులకు అందజేయడం జరిగిందన్నారు. 1,92,732 టన్నుల ఎరువులను రైతులకు సరఫరా చేయడం జరిగిందని చెప్పారు. ప్రతి గ్రామపంచాయతీ నుండి ఛాంపియన్ ఫార్మర్స్‌ను గుర్తించి, వారు ఆచరిస్తున్న నూతన పద్ధతులను ఇతర రైతులు అనుసరించేలా శిక్షణ అందిస్తున్నామన్నారు. "అన్నదాత సుఖీభవ" - "పి.యం. కిసాన్" పథకాల ద్వారా 3,64,216 మంది రైతు కుటుంబాలకు పెట్టుబడి రాయితీగా రూ.261.80 కోట్ల రూపాయలను నేరుగా రైతుల ఖాతాలలో జమ చేశామన్నారు. జిల్లా అభివృద్ధికి వనరులు పుష్కలంగా ఉన్నాయని, బోగోలు మండలం తీరప్రాంతంలో నిర్మించిన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మత్స్యకారులకు ఒక వరమని కలెక్టర్ అన్నారు. 288.89 కోట్ల రూపాయల వ్యయంతో అంతర్జాతీయ స్థాయికి దీటుగా "ఫిషింగ్ హార్బర్" నిర్మించడానికి 76.89 ఎకరాలు భూమిని సేకరించామని తెలిపారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరానికి గాను ఇప్పటివరకు 7,484 కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశామన్నారు.

### ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన :

ఈ సందర్భంగా శకటాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. డీఆర్‌డీఏ శకటానికి ప్రథమస్థానం, వ్యవసాయశాఖకు ద్వితీయస్థానం, మున్సిపల్, టూరిజంశాఖలకు తృతీయస్థానం లభించగా, స్వచ్ఛాంధ్ర, స్వర్ణకారుల శకటాలకు కన్సొలేషన్ బహుమతి లభించింది.



జిల్లా రవాణా శాఖలో ఉత్తమ సేవలందిస్తున్నందుకు గాను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా నుండి ప్రశంసాపత్రాన్నందుకుంటున్న జిల్లా డిప్యూటీ రవాణాశాఖాధికారి బి.చందర్

### విశిష్ట సేవలకి.. ప్రశంసాపత్రాలు

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి, వివిధ రంగాల్లో ప్రతిభచూపిన కళాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. కోవూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు దేశభక్తిని పెంపొందించేలా 'దేశమంటే మట్టికాదోయ్' నృత్యరూపకం అందరినీ ఆకట్టుకుంది. ముత్తుకూరు అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల 'హమారా హిందుస్తానీ' నృత్యప్రదర్శన ఆలోచింప జేసింది. తొలిసారిగా ప్రభుత్వ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో సాగిన కోలాట ప్రదర్శన ప్రభుత్వ పాఠశాలల ప్రతిభను చాటిచెప్పింది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ అజితా వేజెండ్ల విద్యార్థులను అభినందిస్తూ మెమెంటోలనందించారు.



# పాటల కోయిలమ్మలు.. 'సర్వేపల్లి సిస్టర్స్'

## ➤ చిన్న వయసులోనే 'అఖండ' ఖ్యాతి

**నెల్లూరుకు చెందిన ప్రముఖ కర్ణాటక శాస్త్రీయ సంగీత విదుషీమణులు, 'సర్వేపల్లి సిస్టర్స్'గా పేరొందిన డాక్టర్ సర్వేపల్లి శ్రేయ-డాక్టర్ రాజలక్ష్మిలు, ఇటీవల యువరత్న నందమూరి బాలకృష్ణ 'అఖండ-2' చిత్రంలోని రెండు గీతాలను అత్యద్భుతంగా గానం చేసి, అఖండ ఖ్యాతిని పొందారు. ఈ సందర్భంగా, నెల్లూరులోని కళాంజలి సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న వారికి 'స్వర రాగమయి'లనే బిరుదును కూడా ప్రదానం చేయనుంది.**

నెల్లూరులోని ప్రముఖ వైద్యులు డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్-డాక్టర్ లక్ష్మీ శారదల కుమార్తెలైన శ్రేయ-రాజలక్ష్మిలు చిన్నతనం నుంచే సంగీతంపై ఎక్కువ మక్కువ చూపేవారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో, శాస్త్రీయ సంగీత సాధనపై దృష్టి పెట్టి నిరంతర సాధన చేసేవారు. శ్రేయ.. రెండేళ్ళ పసితనంలోనే నెల్లూరులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారు నిర్వహించిన సంగీత పోటీల్లో ప్రథమ బహుమతి అందుకుంది. చెల్లెలు రాజలక్ష్మి కూడా తన సోదరి శ్రేయ సంగీతంలో శిక్షణ పొందుతుండడం చూసి, చిన్నతనం లోనే సంగీతాన్ని అభ్యసించడం ప్రారంభించింది. వీరిరువురూ ప్రారంభ సంగీత పాఠాలను నెల్లూరులోని సంగీత గురువు శైలజా వాణిశ్రీ వద్ద నేర్చుకున్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌కి చెందిన ప్రముఖ సంగీతాచార్యులు విద్వాన్ డా. వైజర్సు బాలసుబ్రహ్మణ్యం వద్ద సంగీత శిక్షణ పొందారు. గత 8 సంవత్సరాలుగా చెన్నైకి చెందిన పద్మభూషణ్ అవార్డు గ్రహీత.. సంగీత కళానిధి బిరుదాంకితురాలైన డా.సుధా రఘునాథన్ వద్ద సంగీతంలో మరిన్ని మెళకువలు నేర్చుకుని, శాస్త్రీయ సంగీత గానంలో తమ ప్రతిభాపాటవాలను నిరూపించుకుంటున్నారు. కర్ణాటక సంగీతంలో గానం విభాగంలో ఆలిండియా రేడియో విజయవాడ కేంద్రం ద్వారా ఏ-గ్రేడుకు ఎంపిక కావడమే కాక, సిసిఆర్‌టీ జాతీయ స్కాలర్‌షిప్‌లను సాధించడం, మద్రాసు మ్యూజిక్ అకాడెమిలో ఉత్తమ బహుమతి నందుకోవడం విశేషం.

### దత్త పీఠంలో తొలి కచేరీ :

సర్వేపల్లి సిస్టర్స్ తమ తొలి సంగీత కచేరీని మైసూరులోని అవధూత దత్త పీఠంలో పరమపూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ వారి దివ్యసన్నిధిలో నిర్వహించి, స్వామీజీవారి ఆశీస్సులందుకున్నారు.ఆ తర్వాత నుంచి తమ సంగీత ప్రస్థానంలో రాష్ట్రంలోనే కాక, దేశ వ్యాప్తంగా ఎన్నో సంగీత కచేరీలు చేసి ఎన్నో అవార్డులను..ఎందరో ప్రముఖుల ప్రశంసలను అందుకున్నారు. చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్, మైసూర్ తదితర ప్రాంతాల్లోనూ కచ్చేరీలు చేశారు. 2019లో పుట్టపర్తిలోని సాయి కుల్వంత్ హాల్‌లో వీరి కచ్చేరీ అందరి ప్రశంసలందుకుంది. 2024లో శ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ వారి ఆశీస్సులతో తెలంగాణ గవర్నర్ చేతులమీదుగా సర్వేపల్లి సిస్టర్స్ 'అవధూత దత్తపీఠం ఆస్థాన విదుషీమణులుగా' విశిష్టమైన బిరుదును అందుకున్నారు. బెంగుళూరులో యువ పురంధర అవార్డు-2024 సాధించారు. ఈటీవీ పాడుతా తీయగా-సీజన్ 8లో శ్రేయ ద్వితీయ బహుమతి సాధించి, గానగంధర్వులు దివంగత పద్మభూషణ్ డా.ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అభినందనలు అందుకున్నారు.

### తల్లిదండ్రుల బాటలో.. వైద్యరంగంలోకి :

తల్లిదండ్రులు వైద్యరంగంలో ఉండడంతో, శ్రేయ-రాజలక్ష్మిలు కూడా వారి బాటలో నడుస్తూ, వైద్యవృత్తినే ఎంచుకుని, కష్టపడి చదువుకుని వైద్యులుగా ఆ రంగం లోనూ రాణిస్తున్నారు. డాక్టర్ శ్రేయ.. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసి, ప్రస్తుతం చెన్నైలో ఎం.డీ (జనరల్ మెడిసిన్) చదువుతున్నారు. డాక్టర్ రాజలక్ష్మి కూడా ఎంబీబీఎస్ పూర్తిచేసి, ప్రస్తుతం నెల్లూరులోని నారాయణ ఆసుపత్రిలో ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు.

### కళాంజలి ఆధ్వర్యంలో.. అభినందన సభ :

సంగీతరంగంలో తమదంటూ ప్రత్యేకతను సాధిస్తూ, నెల్లూరుసీమకే గర్వకారణమైన సర్వేపల్లి సిస్టర్స్‌ను కళాంజలి సంస్థ ఫిబ్రవరి 1వ తేదీ సాయంత్రం 6.05 గంటలకు నెల్లూరు టౌన్‌హాలులో అభినందన సభ నిర్వహించనుంది. 'లాయర్' పత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి, రెడ్‌క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్ రెడ్డి, విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మెన్ డా. ఎన్.సత్యనారాయణ, రోటరీ మాజీ గవర్నర్ దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా, డా. కె.కృష్ణకిశోర్ (డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థలు), డా.ఓ. గోపాలకృష్ణ (ఆర్కా ఐ హాస్పిటల్), కళాంజలి గౌరవాధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబు ఆత్మీయ అతిథులుగా పాల్గొనే ఈ కార్యక్రమంలో పాటల కోయిలమ్మలైన 'సర్వేపల్లి సిస్టర్స్'కి 'స్వర రాగమయి'లనే బిరుదును ప్రదానం చేయనున్నామని నిర్వాహకులు కళాంజలి అనంత్, క్లాసిక్ గ్రాఫిక్స్ అధినేత పి. విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయనీ గాయకులు గాయత్రి, వేదాంబికానాయుడు, శ్రీకృతి, కృష్ణయ్య, మల్లిఖార్జున్‌ల ఆధ్వర్యంలో 'స్వరఝరి' పాటలకచేరీ, స్థానిక గురుకృప కళాక్షేత్రం అధినేత్రి సురభి గాయత్రి శిష్యబృందంచే 'తాండవ నృత్య ప్రదర్శన ఉంటాయని వివరించారు. సంగీతాభిమానులు, కళాకారులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

# 2 రోజులు సెలవుకావాలంటూ.. బ్యాంకు ఉద్యోగుల ఒకరోజు సమ్మె

## పోరు ప్రభుత్వంపైన.. ఇబ్బందులు ప్రజలవి!

తమపై పని ఒత్తిడి అధికంగా ఉంటోందని, కనుక వారంలో 5 రోజుల పని దినాలు మాత్రమే ఉండాలని, శని, ఆది వారాలు సెలవు దినాలుగా ప్రకటించాలని కోరుతూ బ్యాంకు ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్స్ ఆధ్వర్యంలో నెల్లూరులోని కరెంటాఫీసు సెంటర్లో ఉన్న యూనియన్ బ్యాంక్ వద్ద ఈ నెల 27న ఉద్యోగులు ఆందోళన చేశారు. దీంతో బ్యాంకులు మూతపడ్డాయి. ఈ ఆందోళనలో పాల్గొన్న అఖిలభారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య సంయుక్త కార్యదర్శి ఉదయకుమార్ మాట్లాడుతూ, పనివత్తిడి వల్ల పనిగంటలు అయిపోయిన తర్వాత కూడా ఉద్యోగులు పనిచేయాల్సి వస్తోందని, ఇకనైనా అయిదు రోజుల పని విధానాన్ని అమలుచేయాలని కోరారు. దీనివల్ల ఉద్యోగులపై ఒత్తిడి తగ్గి, పనివేళల్లో మరింత మెరుగైన సేవలందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉద్యోగ సంఘాల నాయకులు రమణప్రసాద్, సుమన్, చైతన్య, జహీరా, సనత్ పాల్గొన్నారు.

నాల్గవ శనివారం, ఆదివారం, రిపబ్లిక్‌డేలతో వరుసగా మూడు రోజులు సెలవు దినాలుగా వచ్చిన తరుణంలో నాల్గవ రోజున సమ్మెకి దిగి ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేయాలనే ఉద్దేశంతో మంగళవారాన్ని సమ్మె కోసం ఎంచుకున్నట్లు ఉద్యోగులు చెప్తున్నారు. వారి సమ్మె వల్ల ఇబ్బంది పడేది, బ్యాంకు లావాదేవీలు స్తంభించి అవస్థలు పడేది ఖాతాదారులే తప్ప ప్రభుత్వ విభాగాలు కాదన్న విషయం వారు గుర్తించకపోవడం గమనార్హం.

## గవర్నర్ తేనీటివిందులో.. మురళీమోహన్‌రాజు


గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి చిత్రపటాన్ని అందజేస్తున్న మురళీ మోహన్‌రాజు

జనవరి 26న 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో, విజయవాడ లోక్‌భవన్‌లో జరిగిన తేనేటి విందు కార్యక్రమంలో మన జిల్లా నివాసి, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, యువ రచయిత మురళీ మోహన్‌రాజుకు ఆహ్వానం అందింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో యువతకు ఉపయోగపడే ఎన్నో స్ఫూర్తిదాయకమైన సాహిత్య, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గుర్తింపుగా ఆయనకు ఈ అరుదైన అవకాశం లభించింది. ఈ సందర్భంగా మురళీ మోహన్‌రాజు గవర్నర్‌కు వారి చిత్రపటాన్ని బహూకరించడం విశేషం.

## డా.కిషోర్స్ రత్నంలో.. జెండా పండుగ


స్వాతంత్ర్యసమరయోధుల వేషధారణలో డా. కిషోర్స్ రత్నం చిన్నారులు

నెల్లూరు సరస్వతినగర్‌లోని డా.కిషోర్స్ రత్నం రేస్ ఇంటర్నేషనల్, రోషిణి రత్నం జెఇఇ, కె25 అండ్ మెడికల్ ఒలింపియాడ్ మరియు టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో జనవరి 26న రిపబ్లిక్ డే వేడుకలు సంబరంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఏ.ఓ తుహీన పాల్గొని జాతీయ జెండాను ఎగురవేసి విద్యార్థులతో జెండావందనం చేయించారు. తొలుత విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. కిడ్స్ ఇంటర్నేషనల్ విద్యార్థులు గాంధీజీ, నెహ్రూజీ, డా.బిఆర్ అంబేద్కర్, అబ్దుల్ కలామ్ తదితర జాతీయ నాయకుల వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. ప్రైమరీ, హైస్కూలు విద్యార్థులు హిందీ, తెలుగు, ఇంగ్లీషు భాషల్లో గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం దేశభక్తి గీతాలతో విద్యార్థుల్లో స్ఫూర్తిని కలిగించారు. 'వందేమాతరం', 'దేశం మనదే' వంటి పాటలకు నృత్యాలతో అందరికీ కనువిందు చేశారు. విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కృష్ణ కిషోర్, వాసంతి కిషోర్‌లు విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు రిపబ్లిక్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యా సంస్థల జనరల్ మేనేజర్ రామమూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌కుమార్‌సింగ్, ప్రిన్సిపాల్స్ మణిమాల, జ్యోతి, జాస్మిన్, నాగేంద్ర, కోఆర్డినేటర్ జరీన్‌తాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్లానింగ్ మేనేజ్‌మెంట్ కమిటీ విద్యార్థుల పర్యవేక్షణలో ఈ వేడుకలు ఎంతో ఉత్సాహభరితంగా సాగాయి.

## విలువిద్యలో స్వామిదాస్ విద్యార్థికి కాంస్య పతకం


మక్కి గగన్ విహారి

ఇటీవల ముంబైలో జరిగిన నేషనల్ స్కూల్ లెవల్ విలువిద్య పోటీల్లో నెల్లూరు, బాలాజీ నగర్‌లోని శ్రీ స్వామిదాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి మక్కి గగన్ విహారి కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా పలువురు గగన్‌ని అభినందించి భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.






# నెల్లూరు కబుర్లు

## రూ.30 లక్షలతో.. హోమియోపతి కేంద్రం


ఆయుష్ హోమియోపతి భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు నగర అభివృద్ధి, పేద ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. 47వ డివిజన్‌లో 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఆయుష్ హోమియోపతి డిస్పెన్సరీ భవనానికి ఆయన ఈనెల 25న శంకుస్థాపన చేశారు. ఈ భవన నిర్మాణాన్ని కేవలం 3 నెలల్లో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. 30 ఏళ్ల క్రితమే ఆసుపత్రి కోసం స్థలాన్ని దానం చేసిన గూడూరు మునిస్వామినాయుడు సేవా దృక్పథాన్ని ఈ సందర్భంగా మంత్రి నారాయణ అభినందించారు.

### రంగనాథుని సేవలో...

రథసప్తమి సందర్భంగా ఈనెల 25న మంత్రి నారాయణ, ఆయన సతీమణి రమాదేవితో కలసి నెల్లూరు రంగనాయకుల పేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను దర్శించుకుని స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యప్రభ వాహనంపై కొలువైన స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేద పండితులు మంత్రి దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు.

## నగరంలో కాలువల ఆధునీకరణ

### ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్


కాలువ పనులను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జ్ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్

నెల్లూరు నగరంలో వరద ముప్పు నివారణే లక్ష్యంగా కాల్వల ఆధునీకరణ పనులు చేపట్టామని ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తెలిపారు. పురపాలక మంత్రి నారాయణ ఆదేశాలతో ఈ పనులు చేపడుతున్నామన్నారు. తొలుత ఆయన నగరంలోని 40వ డివిజన్‌లో ఉన్న వెంగన్న కాలువ పనులను పరిశీలించారు. పేదలకు ఇబ్బంది లేకుండా ఆధునీకరణ పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. నెల్లూరు చెరువు నుండి ప్రవహించే ఈ కాలువ అభివృద్ధి కోసం 2.30కోట్లు వ్యయం చేయనున్నట్లు తెలిపారు. మంత్రి నారాయణ ప్రత్యేకంగా ముఖ్యమంత్రితో చర్చించి నెల్లూరులోని కాలువల అభివృద్ధికి 50కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

## దోమలను నివారించండి

● బీజేపీ నాయకుల వినతి

నెల్లూరులో కుప్పలుతెప్పలుగా పెరిగిపోతున్న దోమలను నియంత్రించాలంటూ బీజేపీ నాయకులు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరిల ఆధ్వర్యంలో ఈనెల 27న డీఆర్‌ఓ విజయకుమార్‌కి వినతి పత్రం సమర్పించారు. దోమకాటుతో ప్రజలు ప్రశాంతంగా ఉండలేకపోతున్నారని, దోమల వల్ల వ్యాధులు పెరిగిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## విశ్వసాయిలో గణతంత్ర వేడుకలు


జాతీయ జెండాని ఆవిష్కరిస్తున్న కళాశాల ఛైర్మెన్ సత్యనారాయణ

నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో జనవరి 26న 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మెన్ డా॥ యన్.సత్యనారాయణ రిపబ్లిక్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. 1947 ఆగస్టు 28న జరిగిన సమావేశంలో డా॥ బి.ఆర్. అంబేద్కర్ భారతదేశం యొక్క శాశ్వత రాజ్యాంగం ముసాయిదా డ్రాఫ్టింగ్ కమిటీ నియమించారు. అది పూర్ణస్వరాజ్ ప్రతిజ్ఞగా గౌరవించి 1950లో జనవరి 26న అమలుచేయడం ప్రారంభించారని తెలిపారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సంగ్రామంలో దేశ నాయకులు అనుసరించిన శాంతి పోరాట పంథాను, గాంధీజీ అహింసా పోరాట మార్గాన్ని ఆయన కొనియాడుతూ, ఆధునిక దేశంలో ప్రస్తుత సవాళ్లను ధీటుగా ఎదుర్కొనే సత్తా భావిభారత పౌరులుగా మీకు ఉందని విద్యార్థుల నుద్దేశించి అన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి తమ విధులను నిర్వర్తిస్తే భారతదేశం అత్యుత్తమ స్థాయికి చేరుకుంటుందని ఆయన తెలిపారు.

అన్నమయ్య సర్కిల్ క్యాంపస్ నందు, ఎన్ఎస్ క్యాంపస్, ఆర్ఆర్ క్యాంపస్ నందు డైరెక్టర్స్ డా॥ ఎన్.సత్యనారాయణ, జి.కృష్ణమోహన్, శివ సంకేత్‌లు జాతీయ పతాకాన్ని ఎగురవేసి విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరంలో అసువులు బాసిన అమరవీరులకు, స్వాతంత్ర్యం అనంతరం అసువులు బాసిన యుద్ధ వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. దేశభక్తి గీతాలతో దేశభక్తిని ప్రేరేపించే ప్రసంగాలతో నేటి బాలలే రేపటి పౌరులు అని, దేశమంటే మట్టికాదు, దేశమంటే మనుషులోయ్ అనే నినాదాలతో సంబరాలు ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్‌తో పాటు కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యాబోధన పటిష్టంగా ఉండాలి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎస్.వి.నాయక్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన పటిష్టంగా ఉండాలని, నగరంలోని ప్రతి పాఠశాలను గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ సర్టిఫికెట్ కలిగిన పాఠశాలగా తీర్చిదిద్దాలని ఉప విద్యాశాఖ అధికారి ఎస్‌వి నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. ఇటీవల ఆయన నగరంలోని సంతపేటలో ఉన్న ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. నెల్లూరు పట్టణ ఉప విద్యాశాఖాధికారి ఎస్.వి నాయక్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలను గ్యారంటీడ్ ఎఫ్.యల్.యన్ సర్టిఫికెట్ కలిగిన పాఠశాలగా మార్చడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో నెల్లూరు పట్టణ మండల విద్యాశాఖాధికారి–1 బి.తిరుపాలు మాట్లాడుతూ విద్యార్థుల్లో భాష, గణిత సామర్థ్యాలను పెంపొందించడానికి కృషిచేయాలని, బోధనాభ్యసన సామగ్రిని ఉపయోగించి విభిన్న రీతిలో బోధన చేయాలన్నారు. ప్రభుత్వ డైట్, పల్లిపాడు సీనియర్ ఉపన్యాసకులు కె.విజయచంద్ర, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు ఏ.దయాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రతను పాటించాలి

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 27న నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం జరిగింది. కాలేజీ డీన్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ, వేగం కన్నా ప్రాణం విలువైనదని, రోడ్డు నిబంధనలు పాటించడం, హెల్మెట్ పెట్టుకోవడం వంటి వాటిద్వారా ప్రమాదాలను నివారించుకోవచ్చని సూచించారు. సీనియర్ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, మద్యం సేవించి లేదా నిర్లక్ష్యంగా వాహనం నడపడం ప్రమాదకరమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డీఎం. కార్తీక్, ఎం.స్వప్నిల్‌రెడ్డి, డాక్టర్ విశ్వకుమార్, ఏసీ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొని, విద్యార్థులకు ట్రాఫిక్ నియమనిబంధనల పట్ల అవగాహన కలిగించారు.

# లోకేష్ కృషితో పెట్టుబడుల వెల్లువ

## యువనేత జన్మదినోత్సవంలో బీద రవిచంద్ర



ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, అజీజ్, గిరిధర్‌రెడ్డి తదితర నాయకులు

యువనేత లోకేష్‌బాబు కృషితో రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువలా వస్తున్నా యని టీడీపీ జిల్లా అధ్యక్షులు బీద రవి చంద్ర కొనియాడారు. లోకేష్ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 23న నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన "యువగళం పాదయాత్ర కీలక ఘట్టాలు, ప్రజల్లో లోకేష్ నింపిన చైతన్యం వగైరా లకు సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్‌ని ఆయన వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ పాలనలో ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులు, ఆటంకాలన్నిటినీ సమర్థవం తంగా ఎదుర్కొని టీడీపీ యువనేత నారా లోకేష్ సాగించిన యువగళం పాదయాత్ర రాష్ట్ర భవిష్యత్తును మలుపు తిప్పిందని చెప్పారు. వైసీపీ అరాచక, అవినీతి, అస మర్థ పాలనతో భయభ్రాంతులకు గురవు తున్న రాష్ట్ర ప్రజలకు నారా లోకేష్ అం డగా నిలిచారని, యువగళం పాదయాత్రతో వారిలో ధైర్యం నింపారని అన్నారు. 226 రోజుల పాటు 11 ఉమ్మడి జిల్లాలు, 2097 గ్రామాల మీదుగా సాగిన లోకేష్ పాదయాత్ర సుమారు 3,132 కిలోమీటర్లు సాగిందని, అదొక పెద్ద సంచలనమని ఆయన అన్నారు. యువగళం హామీల అమలే లక్ష్యంగా మేనిఫెస్టో రూపొందిం దన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక, లోకేష్ ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు, పరిశ్రమలు, ఐటీ సంస్థలను ఆకర్షించేందుకు ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు చేస్తున్న కృషితో రాష్ట్రానికి పెట్టుబడులు తరలివస్తున్నాయన్నారు. లోకేష్ యువగళం స్ఫూర్తితో విద్యార్థులకు సైకిళ్లను అందజేస్తున్నామన్నారు.

# విద్యుత్‌శాఖను గాడిన పెడుతున్నాం

## మంత్రి గొట్టిపాటి రవికుమార్



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, పక్కన వేమిరెడ్డి దంపతులు

నెల్లూరులోని కిసాన్ సెజ్ వద్ద 132 కెవి విద్యుత్ స్టేషన్‌ను మంజూరు చేస్తామని, దానిని త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర ఇంధన వనరుల మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. ఈనెల 27న కోవూరు నియోజకవర్గంలోని పంచేడు గ్రామపంచాయతీలో సుమారు 3.37 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 32 /11 కెవి సబ్‌స్టేషన్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోవూరు నియోజకవర్గంలో 4 కోట్ల వ్యయంతో డిఈ కార్యాలయం ఏర్పాటుకు కూడా శంకుస్థాపన చేస్తున్నా మన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సవరించి విద్యుత్‌శాఖను గాడిలో పెడుతున్నామన్నారు. విద్యుత్ శాఖలో ఏఈల కొరత ఉన్నదని, ముఖ్యమంత్రితో చర్చించి 500 ఏఈ పోస్టులను త్వరలోనే భర్తీ చేయడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో నెల్లూరులో మరో 10 నుంచి 12 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటుచేసి నిరంతర విద్యుత్తును అందజేయడంతో పాటు లో-వోల్టేజ్ సమస్యను అధిగమించడం జరుగు తుందన్నారు. రైతులందరిని ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లకు ప్రారంభోత్సవాలు జరగడం సంతోషకరమన్నారు. నెల్లూరు నగర ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్, బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ చైర్‌పర్సన్ సుప్రజ, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఇ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా..యువగళం విజయోత్సవ ర్యాలీ



భారీ జనసందోహంతో 'యువగళం' విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

లోకేష్ యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 27న నెల్లూరు నగరంలో టీడీపీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులు వచ్చేందుకు లోకేష్ చేస్తున్న కృషిని, విద్యారంగ అభివృద్ధిని ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇంచార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో జనవరి 27వతేదీ ఒక అద్భుతమైన రోజుగా అభివర్ణించారు. రాష్ట్ర భవిష్యత్తును తిరగరాసేలా లోకేష్ యువగళం పాదయాత్ర నిర్వహించడం విశేషమని అన్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ, మంత్రి లోకేష్ పరిణితి చెందిన రాజకీయవేత్తగా రాటుదేలారని, ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తీరు అద్భుతమని అన్నారు. లోకేష్ యువగళం పాదయాత్ర ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకి ఒక గేమ్ చేంజర్ అని కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రశంసించారు. నెల్లూరు ఇంచార్జ్ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆ పాదయాత్ర ఒక చరిత్ర

### - ఎమ్మెల్యే సోమిరెడ్డి -

నారా లోకేష్‌బాబు నిర్వహించిన యువగళం పాదయాత్ర చరిత్ర సృష్టించిం దని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొనియా డారు. నియంతపాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించేందుకు ప్రాణాలకు తెగించి లోకేష్ మూడేళ్ల క్రితం ఇదే రోజు (జనవరి 27)న యువగళం పాదయాత్ర చేపట్టారని ఆయన గుర్తుచేశారు. అప్పట్లో, ఓ వైపు తమ తండ్రి నారా చంద్రబాబు నాయుడుని అక్రమ కేసుతో జైలులో బంధించినా, పవన్ కళ్యాణ్‌ని నడిరోడ్డుపై నిలబెట్టి వేధించినా, యువగళం పాదయాత్రకు అడుగడుగునా ఆటంకాలు కల్పించినా లోకేష్‌బాబు ఎక్కడా వెనకడుగు వేయకుండా 3132 కిలోమీటర్లు నడిచారని, ప్రజల భవిష్యత్ కోసం రాజీ లేకుండా ముందుకు సాగ డంలో తాతకు తగ్గ మనుమడు, తండ్రికి తగిన తనయుడిగా నిలిచారని ఆయన ప్రశంసించారు. ఆ పాదయాత్ర స్ఫూర్తితో సర్వేపల్లి నియోజకవర్గంలో ఈనెల 27న ప్రభుత్వ స్కూళ్లలోని బాలికలకు 3132 సైకిళ్ల పంపిణీ చేస్తున్నామని అన్నారు.

# రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న కలెక్టర్



ప్రభుత్వ సీ.ఎస్ కె.విజయానంద్ చేతుల మీదుగా అవార్డునందుకుంటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఉత్తమ ఎన్నికల నిర్వహణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో విశేష ప్రతిభకు గుర్తింపుగా, ఆ ప్రక్రియలో అత్యుత్తమ ఎన్నికల మ్యాపింగ్‌ను సమర్థవంతంగా అమలు చేసినందుకు నెల్లూరుజిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు రాష్ట్రస్థాయి అవార్డు లభించిన విషయం తెలిసిందే! విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 25న నిర్వహించిన 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతుల మీదుగా కలెక్టర్ ఈ అవార్డును అందుకున్నారు. అత్యుత్తమ ఎన్నికల మ్యాపింగ్‌ను విజయవంతంగా అమలు చేయడం ద్వారా నెల్లూరు జిల్లా రాష్ట్ర స్థాయిలో 5వ స్థానం సాధించింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్, విశ్రాంత ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌లతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు అవార్డును ప్రదానం చేశారు.

జిల్లా ఎన్నికల ఉప తహశీల్దార్ అషర్, ఉత్తమ బిఎల్ఓ పర్యవేక్షకుడిగా రాంప్రసాద్, జిల్లాలో అత్యధిక మ్యాపింగ్ సాధించిన ఉత్తమ బిఎల్ఓగా బొల్లం వెంకటరమణయ్యలకు కూడా అవార్డులను అందజేశారు.

# శ్రీసిటీలో.. పారిశ్రామిక సదస్సులు

శ్రీసిటీలో ఇటీవల మూడురోజుల పాటు వివిధ అంశాలపై పారిశ్రామిక సదస్సులు జరిగాయి. ఆదర్శ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఏసీసీఐ) శ్రీసిటీ సంయుక్త ఆధ్వర్యంలో విదేశీ వాణిజ్యంపై పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఏసీసీఐ ఉపాధ్యక్షుడు వి.వి.సంపత్‌కుమార్, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పాల్గొని, అంతర్జాతీయ పోటీకి ధీటుగా పరిశ్రమలకు అవసరమైన నైపు ణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం అందించాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు. అదేవిధంగా బాధ్యతాయుత వ్యాపార విధానాలపై వర్క్‌షాప్‌ని శ్రీసిటీ, దక్షిణ భారత వాణిజ్య మరియు పరిశ్రమల మండలి(ఎస్ఐసీసీఐ) సంయుక్తంగా నిర్వహించాయి. ఐక్యరాజ్య సమితి ఆమోదించిన అజెండా-2030లో 17 స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలైన పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలను చర్చించారు. పరిశ్రమల ప్రమాణాలపై శ్రీసిటీ, ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఇండియా (ఎఫ్ఎస్ఎంఇ), భారతీయ ప్రమాణాల బ్యూరో (బీఐఎస్) సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీసిటీ



అవగాహన ఒప్పందం చేసుకున్న డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఏ.పి.కే.రెడ్డి

ఎం.డీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్ర మాలు పరిశ్రమల్లో ప్రమాణాల ఆచరణను బలోపేతం చేయడమే కాకుండా, భారతదేశ నాణ్యతా లక్ష్యాలను ముందుకు తీసుకెళ్తా యన్నారు. ఈ సందర్భంగా శ్రీసిటీ, ఎఫ్ఎస్ఎంఇ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఎఫ్ఎస్ఎంఇ ఇండియా జాతీయ అధ్యక్షుడు ఏ.పి.కే.రెడ్డి సంతకాలు చేశారు.




# ఈ విద్యా వెలుగులు.. మీ కోసమే!

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

నేటి ప్రపంచం వేగంగా మారుతోంది. మనం ఊహించని మార్పులు, ఊహించని అవకాశాలు, ఊహించని సవాళ్లు.. ఇవన్నీ విద్యార్థుల ముందుకు వస్తున్నాయి. టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్ వంటి శక్తులు మన పని విధానాలను మాత్రమే కాదు, మన జీవితాల దిశనే మార్చేస్తున్నాయి. ఈ మార్పుల మధ్య విద్యార్థి ఏ దిశలో నడవాలో, ఏ నిర్ణయం తీసుకోవాలో, ఏ నైపుణ్యాలు నేర్చుకోవాలో, ఏ భవిష్యత్తును నిర్మించుకోవాలో అర్థం చేసుకోవడం మరింత క్లిష్టమైంది.

ఇలాంటి సమయంలో విద్యార్థికి అవసరమయ్యేది ఒక మార్గదర్శక స్వరం, ఒక నమ్మకమైన దారి చూపే చేయి, ఒక స్పష్టమైన దృష్టి. ఆ అవసరాన్ని గుర్తించిన 'లాయర్' పత్రిక, విద్యార్థుల కోసం దారిదీపంగా ఒక ప్రత్యేక విద్యా వేదికను ప్రారంభిస్తోంది. ఆ సరికొత్త ధారావాహిక శీర్షికే..'జ్ఞాననేత్రం'. ఇది కేవలం చదువు గురించి కాదు. మార్కులు, ర్యాంకులు, పరీక్షల గురించి మాత్రమే కాదు. ఇది విద్యార్థి మనసును విస్తరించే ప్రయాణం. ఇది ఆలోచనలను పదును పెట్టే ప్రయాణం. ఇది భవిష్యత్తును నిర్మించే ప్రయాణం. ప్రతి వారం ఒక కొత్త అంశం, ఒక కొత్త దిశ, ఒక కొత్త ఆలోచన..విద్యార్థి జీవితంలో ఒక చిన్న కాంతిరేఖను వెలిగించడానికి చేసే ప్రయత్నం. అదే వారికి భవిష్యద్దర్శనం కావాలి. తద్వారా వారి జీవితాలు జ్ఞానమయం కావాలన్నదే ధ్యేయం

మన సమాజంలో విద్యను చాలాసార్లు ఒక పరీక్షగా, ఒక పోటీగా, ఒక బాధ్యతగా మాత్రమే చూస్తారు. కానీ విద్య యొక్క అసలు శక్తి చాలా లోతైనది. విద్య మన ఆలోచనలను మార్చుతుంది. మన దృష్టిని విస్తరిస్తుంది. మనలోని సామర్థ్యాన్ని మేల్కొలుపుతుంది. ఒక మంచి గురువు, ఒక మంచి పుస్తకం, లేదా ఒక జీవన అనుభవం... ఇవి ఒక విద్యార్థి జీవితాన్ని పూర్తిగా మార్చగలవు.

ఈరోజు ఒక చిన్న పట్టణంలో చదువుతున్న విద్యార్థి కూడా ఆన్‌లైన్ ద్వారా ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల పాఠాలను వినగలుగుతున్నాడు. ఒకప్పుడు పెద్ద సంస్థలకే పరిమితమైన అవకాశాలు, ఈరోజు ఒక ల్యాప్‌టాప్‌తోనే ప్రపంచం ముందు తెరుచుకుంటున్నాయి. కానీ అదే సమయంలో సోషల్ మీడియా పోలికలు, నిరంతర డిజిటల్ డిస్ట్రాక్షన్స్, వేగంగా మారుతున్న కెరీర్‌లు.. ఇవన్నీ విద్యార్థిని గందరగోళానికి గురిచేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిజమైన విద్య అంటే సమాచారాన్ని సేకరించడం కాదు; ఆలోచించే శక్తిని పెంచుకోవడం.

ఈ శీర్షిక ద్వారా.. మీ ముందుకు వచ్చేది ఒక గురువుగా కాదు, ఒక ఉపదేశకుడిగా కాదు.. ఒక సహయాత్రికుడిగా. విద్యార్థులు ఎదుర్కొంటున్న ఒత్తిడి, భయం, ఆశలు, గందరగోళం.. ఇవన్నీ నా అనుభవాల్లో భాగమే. ఈ ప్రయాణంలో నేను మీతో పాటు అడుగులువేస్తూ, వెళ్లే అయోమయపు చీకటి దారిని కొంచెం తొలగించడానికి ప్రయత్నిస్తాను. మీరు ఆలోచిస్తే, ఆ ఆలోచనను విస్తరించడానికి నేను సహకరిస్తాను. మీరు కలలు కంటే, ఆ కలలను సాకారం చేసుకునేందుకు అవసరమైన మానసిక, సామాజిక మూలధనాన్ని బలపరిచే ప్రయత్నం చేస్తాను.

ఈ ధారావాహికలో మనం మాట్లాడేది పాఠ్యపుస్తకాల గురించి మాత్రమే కాదు. జీవితం గురించి. నైపుణ్యాల గురించి. భవిష్యత్తు అవకాశాల గురించి. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, ఆలోచనా శక్తి, నాయకత్వం, సృజనాత్మకత..ఇవే విద్యార్థి జీవితాన్ని నిర్మించే నిజమైనపునాదులు. ఈ పునాదులు బలంగా ఉంటే, విద్యార్థులు ఏ రంగంలోనైనా నిలబడగలరు.

ఒకప్పుడు విద్యను ఉద్యోగానికి దారి తీసే సాధనంగా మాత్రమే చూశాం. కానీ నేటి ప్రపంచంలో ఉద్యోగాలు మారుతున్నాయి, వృత్తులు రూపాంతరం చెందుతున్నాయి. వ్యక్తి జీవితంలో దిశ మార్పు సహజమైపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో విద్య మనకు ఇచ్చేది కేవలం ఉద్యోగం కాదు, మార్పులకు అనుగుణంగా మారగల శక్తి. నేర్చుకోవడం, ఎలా నేర్చుకోవాలో చెప్పే సామర్థ్యం.

దీనిని ప్రారంభించే ముందు నా మనసులో ఉన్న ఒకే ఒక ఆలోచన..మనవిద్యార్థులు ప్రపంచస్థాయి ఆలోచన కలిగి ఉండాలి. వారు ఎక్కడ చదువుతున్నారన్నది కాదు, ఎలా ఆలోచిస్తున్నారన్నదే ముఖ్యం. వారి కలలు ప్రపంచాన్ని తాకాలి. వారి ఆలోచనలు పరిమితులను దాటాలి. వారి భవిష్యత్తు అవకాశాలతో నిండాలి. ఆ దిశలో ఇదొక శక్తివంతమైన ప్రయత్నం.

ఈ ప్రయాణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ భాగస్వాములే. ప్రతివారం చదివే వ్యాసం నిజంగానే ఒక జ్ఞాననేత్రమై..మీ కళ్లల్లో.. ఇళ్లల్లో, తరగతుల్లో, ఆలోచనల్లో సరికొత్త వెలుగు తీసుకురావాలి. ఆ చిన్న మార్పే పెద్ద మార్పులకు విత్తనం అవుతుంది. చివరిగా: విద్య అనేది ఒక పరీక్ష కాదు, ఒక నిరంతర ప్రయాణం. మార్కులు మైలురాళ్లు కావచ్చు, కానీ దారిని నిర్ణయించేది ఆలోచనా శక్తి. ఒక మంచి ఆలోచన..ఒక జీవితాన్నే మార్చగలదు. అందుకే ఈ ప్రయత్నం. ఇదొక విద్యా వెలుగుల నిరంతర జ్ఞానప్రవాహం!..

చదవండి!.. చదివించండి!.. చదివి.. మంచిగా ఆలోచించండి!.. ఉత్తమ భవితకు బాటలు వేసుకోండి!...

E-mail: reddyu@gmail.com

## రచయిత గురించి చిరుపరిచయం :



'జ్ఞాననేత్రం'.. శీర్షిక రచయిత పేరు..డా. నరసింహారెడ్డి ఊరిమిండి. నెల్లూరు జిల్లా పొంగూరులో జన్మించి, గత ముప్పై ఐదు సంవత్సరాలుగా అమెరికాలోని డాలస్,టెక్సస్‌లో నివసిస్తూ, టెలికం-ఐటీ రంగాల్లో దాదాపు మూడు దశాబ్దాలకుపైగా సేవలందిస్తున్నారు. విద్యాబోధనపై అపారమైన అభిమానంతో రెండున్నర దశాబ్దాలుగా విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుడిగా కొనసాగుతున్నారు. తెలుగు భాషా సాహిత్యాభిమాని కూడా అయిన ఆయన టాన్‌టెక్స్‌లో అనేక తెలుగు, తెలుగేతర సంస్థల్లో సేవలందించి, ప్రముఖ సినీ నేపథ్య గాయకులు.. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఏసుదాసు, సినీకవి సిరివెన్నెల వంటి మహనీయులతో సాహిత్య, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. శంకరనేత్రాలయ – యుఎస్‌ఏ పాలక మండలి సభ్యుడిగా వేలాదిమంది కంటిశస్త్రచికిత్సలకు నిధులు సమకూర్చి, 'విద్యాధనం: నయనం ప్రధానం' వంటి రేడియో కార్యక్రమాలను గత ఏడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. "గానసుధ" రేడియోలో పదిహేనేళ్లుగా వ్యాఖ్యాతగా వైవిధ్య భరితమైన కార్యక్రమాలను చేస్తున్నారు. ప్రతి సంవత్సరం భారత విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవసరమైన వ్యక్తిత్వ వికాస ప్రసంగాలు అందిస్తున్నారు. ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్‌లో బి.టెక్, ఎం.టెక్, పీహెచ్‌డీ, ఫైనాన్సులో ఎంబీయే, మరియు ఉన్నత విద్యలో ఎంఎస్ పూర్తిచేసి తన 5వ పట్టా అందుకున్నారు.

# గణతంత్ర వేడుకల్లో ఆకట్టుకున్న.. శ్రీసిటీ శకటం!

జనవరి 26న తిరుపతి జిల్లాలో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఈసారి తొలిసారిగా శ్రీసిటీ శకటాన్ని ప్రదర్శించడం విశేషం. ఏపీ ఐఐసి, డీఐసి ఆధ్వర్యంలో రూపొందిన ఈ శకటం బహుళ రంగాల తయారీ, గ్లోబల్ పెట్టుబడులు, ఉపాధి కల్పన, మహిళా సాధికారత వంటి అంశాలను ప్రతిబింబిస్తూ అందరినీ ఆకట్టుకుంది.




అదేవిధంగా, శ్రీసిటీలోనూ గణతంత్ర సంబరాలు జరిగాయి. సత్యవేడు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏ.వి.నాగరాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో, అందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీసిటీ పరిధిలోని సెజ్ డీసీ కార్యాలయం, క్రియా యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ, చిన్మయ విద్యాలయ, 17 ప్రభుత్వ పాఠ శాలల్లో జాతీయజెండా ఆవిష్కరణలు జరిగాయి. శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీసిటీ భద్రతా విభాగంలో విశిష్ట సేవలందించిన పలువురు సిబ్బందికి నగదు పురస్కారాలు, సర్టిఫికెట్‌లను అందజేశారు. శ్రీసిటీ సెక్యూరిటీ హెడ్ రమేష్, వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# స్వేచ్ఛా వాణిజ్యంతో ఆర్థిక సార్వభౌమత్వం

మనసులో మాట 82

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఒక కీలకమైన కూడలిలో ఉంది. దశాబ్దాల పాటు సాగిన గ్లోబల్ విలేజ్ భావన ఇప్పుడు ఆర్థిక సార్వభౌమత్వం, "మిత్రపక్ష వాణిజ్యం" (Friend-shoring) వైపు మళ్లుతోంది. ఈ క్రమంలో ఇటీవల న్యూఢిల్లీ వేదికగా భారత్ ఐరోపా సమాఖ్య (EU) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (FTA) చర్చలు విజయవంతంగా ముగిశాయి. గత రెండు దశాబ్దాలుగా సాగుతున్న ఈ చర్చలు త్వరలోనే అధికారిక సంతకాలతో అమలులోకి రానున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నట్లుగా, ప్రపంచ జీడీపీలో దాదాపు 25శాతం వాటా కలిగిన ఈ రెండు శక్తులు ఆర్థికంగా జతకట్టడం అంతర్జాతీయ వాణిజ్య ముఖచిత్రాన్నే మార్చివేయనుంది.

## కెనడా ప్రధాని హెచ్చరికలో వాస్తవమెంత?

సరఫరా గొలుసు అనేది ఒక వస్తువు ముడిసరుకు సేకరణ నుండి తయారీ, రవాణా ద్వారా వినియోగదారుడికి చేరే వరకు జరిగే ప్రక్రియల సమాహారం. ప్రస్తుతం ఈ వ్యవస్థపై ఏకపక్ష ఆధిపత్యం చెలాయించే ప్రయత్నాలు పెరిగాయి. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఇటీవల చేసిన హెచ్చరిక ఇక్కడ అత్యంత గమనార్హం. అమెరికా తన ఆర్థిక నిబంధనలు, వివిధ దేశాలపై అధిక సుంకాలు, రాయితీల ద్వారా గ్లోబల్ సప్లై చైన్‌ను తన ప్రయోజనాలకు అనుగుణంగా మార్చుకుంటోందని, ఇది ఇతర దేశాల ఆర్థిక స్వయంప్రతిపత్తికి ముప్పు అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో చైనా తయారీ రంగంలో ఇలాగే ఏకఛత్రాధిపత్యం వహించి, సంక్షోభ సమయాల్లో ప్రపంచాన్ని ఇబ్బందులకు గురిచేసింది. ఇప్పుడు అమెరికా ఆధిపత్యం పెరిగితే, అది కూడా ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి సవాలుగా మారవచ్చు. ఈ ఆధిపత్య పోరు నుండి ఆర్థిక వ్యవస్థలను కాపాడుకోవడానికి దేశాలు తమ వాణిజ్య భాగస్వామ్యాలను వైవిధ్యం చేసుకోవడం తప్పనిసరి.

## ఎఫ్టీఏలు స్వతంత్ర మార్గాలు

చాలామందికి ఉండే సందేహం ఏమిటంటే, ఇలాంటి ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధమా? అని. నిజానికి, ఈ ఒప్పందాలు ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు లోబడే ఉంటాయి. ప్రపంచ వాణిజ్యసంస్థ నిబంధనల్లోని 'మోస్ట్ ఫేవరెడ్ నేషన్' (MFN) సూత్రం ప్రకారం ఒక దేశం మరొక దేశానికి ఇచ్చే వెసులుబాటు అందరికీ ఇవ్వాలి. కానీ, ఆ సంస్థ ఆర్టికల్ 24 దీనికి మినహాయింపునిస్తుంది. దీని ప్రకారం, రెండు దేశాలు స్వేచ్ఛా వాణిజ్యం ఒప్పందం కుదుర్చుకుంటే, అవి ఒకరికొకరు ఇచ్చుకునే ప్రత్యేక వెసులుబాట్లను(సుంకాలు లేకపోవడం వంటివి) మిగిలిన దేశాలకు వర్తింపజేయాల్సిన అవసరం లేదు. దీనివల్ల భారత్ వంటి దేశాలకు అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలను అతిక్రమించకుండానే, తమకు నచ్చిన దేశాలతో ప్రత్యేక ఆర్థిక బంధాన్ని ఏర్పరుచుకునే గేమ్ ఛేంజర్ వంటి అవకాశం లభిస్తుంది.

భారత్ ఇటీవల కాలంలో వాణిజ్య దౌత్యంలో సరికొత్త వేగాన్ని ప్రదర్శించింది. కేవలం చర్చలకే పరిమితం కాకుండా, వరుసగా కీలక ఒప్పందాలను పూర్తి చేస్తోంది. యూఏఈతో సీఈపీఏ ఒప్పందం దీని ద్వారా మధ్యప్రాచ్య మార్కెట్లకు భారత్ ఒక ప్రధాన ఎగుమతి కేంద్రంగా మారింది.ఆస్ట్రేలియాతో ఈసీటీఏ ఒప్పందం ద్వారా ఇంధనం, ముడిసరుకుల సేకరణలో భారత్‌కు భరోసా లభించింది. స్విట్జర్లాండ్, నార్వే వంటి దేశాల నుండి రాబోయే 15 ఏళ్లలో $100 బిలియన్ల పెట్టుబడులకు మార్గం సుగమమైంది. భారత్-ఐరోపా సమాఖ్య చర్చలు విజయవంతం కావడంతో ఐరోపాలోని 27 దేశాల భారీ మార్కెట్ ఇప్పుడు భారతీయ ఉత్పత్తులకు తలుపులు తెరిచింది.ఒకప్పుడు ఐరోపా దేశాలకు భారత్ గొప్ప ఆర్థిక ఆసరా. భారత్ నుంచి నూలు, మసాలా దినుసులు పెద్ద ఎత్తున ఐరోపాకు వెళ్లేవి. క్రమంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులు మారి అమెరికా, చైనా ఆధిపత్యంలోకి వ్యవస్థ వెళ్లింది. ఐరోపా దేశాలు కూడా అమెరికాకు విశ్వసనీయ భాగస్వాములుగా ఉంటూ వచ్చాయి. అయితే ఇటీవల ట్రంప్ ఏకపక్ష వైఖరితో మిత్రదేశాలైన ఐరోపా దేశాలపైనా ఆర్థిక బెదిరింపులకు దిగడంతో వాటికి వాస్తవం తెలిసి వచ్చింది. అందుకే భారత్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి ఐరోపా సమాఖ్య తొందరపడుతోంది. భారత్‌కు కూడా ఈ ఒప్పందం లాభదాయకమే.

భారతదేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే తయారీ రంగం వెన్నెముకగా నిలవాలి. ఈ ఒప్పందం ఖరారయితే భారతీయ వస్త్రాలు, తోలు వస్తువులు, ఫార్మా ఉత్పత్తులపై ఐరోపాలో సుంకాలు పూర్తిగా తొలగిపోతాయి. దీనివల్ల ఏటా సుమారు $33 బిలియన్ల అదనపు ఎగుమతులు సాధ్యమవుతాయి. ఐరోపా నుండి వచ్చే అత్యాధునిక సాంకేతిక పెట్టుబడులు లక్షలాది మంది యువతకు ఉపాధిని కల్పిస్తాయి. ఐరోపా.. చైనాపై ఉన్న అతిగా ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి భారత్ ఒక నమ్మకమైన ప్రత్యామ్నాయం. 145 కోట్ల జనాభా ఉన్న భారత మార్కెట్లో యూరోపియన్ కార్లు, వైన్, యంత్రాలకు భారీ డిమాండ్ ఉంది. ఈ ఒప్పందం అమలైతే ఐరోపా కంపెనీలకు ఏటా సుమారు 4 బిలియన్ యూరోల సుంకాలు ఆదా అవుతాయని అంచనా. భారత్-ఐరోపా సమాఖ్య మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారయితే అమెరికా, చైనా వంటి శక్తుల ఏకపక్ష ఆధిపత్యం లేని ఒక "బహుళ ధృవ" ఆర్థిక వ్యవస్థకు పునాది పడుతుందనడంలో సందేహం లేదు. ప్రపంచ ఉత్పత్తిలో నాల్గవ వంతు వాటా కలిగిన ఈ రెండు శక్తులు జతకట్టడం వల్ల, గ్లోబల్ సప్లై చైన్ మరింత సురక్షితంగా, పారదర్శకంగా మారుతుంది. ఇది భారత ఆర్థిక సార్వభౌమత్వానికి భరోసా ఇస్తూనే, దేశాన్ని అగ్రరాజ్యాల సరసన నిలబెట్టే ఒక శక్తివంతమైన అడుగు అవుతుంది.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

# మహనీయ నేత..నేతాజీ



మాట్లాడుతున్న ఏఎస్పీ సౌజన్య, పక్కన నేతాజీ సుబ్బారెడ్డి తదితరులు

దేశ స్వాతంత్ర్యం కోసం వీరోచితంగా పోరాడిన నేతాజీ సుభాష్‌చంద్రబోస్ దేశభక్తి అపూర్వమని వక్తలు కొనియాడారు. నేతాజీ 129వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 23న నెల్లూరులోని శ్రీ నేతాజీ విద్యాసంస్థల ఛైర్మెన్ ఎం.వి నేతాజీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఎస్పీ సౌజన్య, వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా-203 గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, వాకర్స్ ప్రతినిధులు పలగాటి శ్రీనివాసులురెడ్డి, జేసీఐసీ క్లబ్ అబ్దుల్, ఏ. రామిరెడ్డి, నేతాజీ అభిమాని శంకరయ్యలతో కలసి స్థానిక మినీ బైపాస్‌రోడ్డులోని నేతాజీ విగ్రహానికి ఎం.వి సుబ్బారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ విద్యాసంస్థల డైరెక్టర్ డా.సుబ్రామ్ నేతాజీ దేశభక్తిని విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం వారు 2024-25లో పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన 17 మంది విద్యార్థులకు లక్షా10వేల రూపాయల నగదు బహుమతులను అందజేశారు. నేతాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు వేదవతి సుబ్బారెడ్డి, పాఠశాల సీనియర్ డైరెక్టర్ నరేంద్రరెడ్డి, డా. అలేఖ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎల్ నరసింహారావు, ప్రిన్సిపాల్ సుధ, వైస్ ప్రిన్సిపాల్ కె.స్పందన, ఏ.ఓ ఆర్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

# 1న..అన్నమయ్య కీర్తనల పోటీలు

నెల్లూరులోని కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1గంట వరకు అన్నమాచార్య సంకీర్తనల పోటీలు నిర్వహించనున్నారు. స్థానిక టౌన్‌హాలులో జరిగే ఈ పోటీల్లో జూనియర్స్, సీనియర్స్ విభాగాలుంటాయని, 13 ఏళ్ళలోపు వయసున్నవారు జూనియర్స్‌గా, అంతకు పైబడిన వారిని సీనియర్స్‌గా పరిగణిస్తామని నిర్వాహకులు కళాంజలి అనంత్ తెలిపారు. ప్రతి విభాగంలోనూ విజేతలకి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుంటాయని, వివరాలకు 9848 959575 సెల్‌ఫోన్ నంబరును సంప్రదించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

# భలే భలే చిత్రాలు!

## ఆకట్టుకున్న నెల్లూరీయుల చిత్రకళ



'కలర్స్ ఆఫ్ నెల్లూరు' చిత్రకళా ప్రదర్శనని ప్రారంభించి, చిత్రాలను తిలకిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరులోని పలువురు ప్రముఖ చిత్రకారులు ఇటీవల 'కలర్స్ ఆఫ్ నెల్లూరు' పేరుతో స్థానిక టౌన్‌హాలులోని రీడింగ్‌రూమ్‌లో ఏర్పాటుచేసిన చిత్రకళా ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఈ ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేసి, చిత్రకారుల్లో స్ఫూర్తిని నింపారు. వారు వేసిన చిత్రాలు బాగున్నాయంటూ అభినందించారు. చిత్రకళను ఆదరించాలని, చిత్రకారులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథిగా అమరావతి కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడుతూ, ఎంతో కష్టపడి వేసిన చిత్రాలను ఆదరించి కొనుగోలు చేసి చిత్రకారులని ప్రోత్సహించాలని కోరారు. అనంతరం కలెక్టర్‌ను సన్మానించారు. రాష్ట్ర జాతీయస్థాయిలో పలు అవార్డులు పొందిన చిత్రకారులు అమీర్ జాన్, సుందరబాబు, అరుణ, సునీతారవి, గుర్రం శ్రీనాథ్, శేషయ్య, పేరం రమణ, బాలకృష్ణ, శ్రీనివాసులురెడ్డి, గజేంద్ర, కృష్ణమ నాయుడు, మనోజ్‌లు తమ చిత్రాలను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించి అందరి ప్రశంసలందుకున్నారు. ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు జరిగిన ఈ చిత్రకళా ప్రదర్శనలోని చిత్రాలు వారి భావచిత్రణలకు ప్రతీకలుగా అనిపించాయి. దేవతామూర్తుల చిత్రాలు, పల్లె చిత్రాలతో పాటు ప్రకృతి చిత్రాలు మైమరపించాయి. ప్రముఖ హాస్యనటుడు దోర్నాల హరిబాబు, అందె శ్రీనివాసులు, శ్రేయా రియల్ ఎస్టేట్ మేనేజింగ్ డైరెక్టర్ ఆగస్టిన్ పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్ ఐఎస్టీ సారథ్యంలో.. ఏఐపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న కళాశాల డైరెక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, సబరి బాలాజీ తదితరులు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకెఆర్ ఐఎస్టీ సారథ్యంలో ఐఇఇఇ కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్ సొసైటీ స్టూడెంట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఈనెల 23న జనరల్ ఏఐ, ఇంటిగ్రేటింగ్ ఎల్ఎల్ఎం మరియు ఆర్ఏజీ ఇన్ ప్రాక్టీస్ అనే అంశంపై వర్క్‌షాప్ జరిగింది. జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ఉన్న తాజా అభివృద్ధి వివరాలను, వాటి వాస్తవ పరిస్థితులను టెక్ మహేంద్ర సొల్యూషన్స్ ఆర్కిటెక్ట్ సబరి బాలాజీ విద్యార్థులకు విశదీకరించారు. ముఖ్య అతిథిగా కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతకాలంలో జనరేటివ్ ఏఐ, మరియు ఆధునిక సాంకేతికతలు విద్యార్థుల భవిష్యత్‌కు ఎంత ముఖ్యమో తెలియజేశారు. విద్యార్థులు కొత్త సాంకేతికతలపై దృష్టిపెట్టి విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం. శ్రీనివాసులు, ఐఇఇఇ ఎస్‌బి కౌన్సిలర్లు డా. ఎస్ సురేష్‌బాబు, డా.కె. దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## లోకేష్ జన్మదిన సంబరాలు



లోకేష్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న తానంకి నానాజీ, దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి తదితరులు

చిల్లకూరు మండల కేంద్రంలోని జ్యోతి వేట్రిడ్జ్ వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు డా. పాశిం సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు పెంచలకోన నరసింహస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ తానంకి నానాజీ పర్యవేక్షణలో యువజన నాయకులు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబు జన్మదిన వేడుకలను మండల పార్టీ అధ్యక్షులు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... రాష్ట్ర అభివృద్ధికి లోకేష్‌బాబు చేస్తున్న కృషి ఎనలేనిదని, భవిష్యత్ తరాల యువ నాయకుడిగా లోకేష్‌బాబు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పట్టాభిరామిరెడ్డి, చిల్లకూరు పీఏసీఎస్ అధ్యక్షులు కొండ రామచంద్రారెడ్డి, మండల పార్టీ కార్యదర్శి నెల్లటూరు చిరంజీవి, రాష్ట్ర లైవ్ స్టాక్ డైరెక్టర్ గుండాల లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరం




గూడూరు మండల పరిధిలోని విందూరు గ్రామంలో ఇటీవల ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. స్వర్ణభారత్ ట్రస్ట్ సహకారంతో ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. సుమారు 64 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విందురు గ్రామ మాజీ సర్పంచ్ ఎగిరెడ్డి మల్లికార్జునరెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

## ఘనంగా గణతంత్రం



జెండా వందనం చేస్తున్న ఆర్డీవో అనూష

గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 26న గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. ఇంచార్జ్ ఆర్డీవో అనూష జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ పలు శాఖల ద్వారా గూడూరు డివిజన్‌లో అనేక అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలియజేశారు. గూడూరు తహశీల్దార్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఎల్‌పిఓ వాణి, డిప్యూటీ డీఇఓ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సరస్వతి శిశు మందిరంలో అక్షరాభ్యాసాలు



హోమం నిర్వహిస్తున్న శ్రీకంటి రామమోహన్‌రావు దంపతులు

వసంత పంచమి సందర్భంగా ఈ నెల 23వతేదీ గూడూరులోని శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాలలో 49మంది పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మెన్ శ్రీకంటి రామమోహన్‌రావు, రాజ్యలక్ష్మి దంపతులు హోమంలో పాల్గొని, పిల్లల చేత అక్షరాభ్యాసం చేయించారు. నెల్లూరుజిల్లా కార్యదర్శి జీవి శేషారెడ్డి, పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురళీరెడ్డి. ప్రబంధకారిణి కార్యదర్శి డాక్టర్ బండి శ్యాంసుందరరావు(మయూరి శ్యాంయాదవ్), ఉపాధ్యక్షులు సోమనాథ్, ఎస్.వి.ఎల్.ప్రసాద్, వాకాటి రామ్మోహన్, పాఠశాల ప్రధానాచార్యులు వి.రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.



చిల్లకూరు పీఎస్‌లో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల

## కోట, చిల్లకూరు పీఎస్‌లలో జిల్లా ఎస్పీ

కోట, చిల్లకూరు మండలాల పోలీసుస్టేషన్‌లను ఇటీవల జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సందర్శించారు. క్రైమ్ రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీచేశారు. మహిళా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యమన్నారు. పెండింగ్ కేసులను వేగవంతంగా పూర్తి చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. రాత్రి పూట గస్తీ ముమ్మరం చేయాలని, కోస్తా ప్రాంతాల ప్రజలతో సమన్వయం, విజిబుల్ పోలీసింగ్ ద్వారా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. పోలీస్‌స్టేషన్లో పనిచేస్తున్న ప్రతి ఒక్క సిబ్బందితో ముఖాముఖి మాట్లాడి వారి విధులు, బాగోగులు తెలుసుకున్నారు.

## సమ్మెను జయప్రదం చేయండి

కేంద్ర ప్రభుత్వం కార్మిక సంస్కరణల పేరుతో తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సి.ఐ.టి.యు నాయకులు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఈ నెల 28న చిల్లకూరు మండల పరిధిలో నున్న తిరుమల పాల కేంద్రం హెచ్.ఆర్.మేనేజర్‌కి, అపెక్స్ ఫుట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ సిబ్బందికి మరియు గూడూరు ఆర్టీసీ డిపో మేనేజర్ పి.సి.హెచ్.లక్ష్మికి సమ్మె నోటీసులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ సి.ఐ.టి.యు నాయకులు బి.వి.రమణయ్య, పామంజి మణి, అడపాల ప్రసాద్, గండికోట మధు, కె.ఎస్.వాసులు, రమణయ్య, జి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



## అసెంబ్లీ సమావేశ మందిరంలో బీసీల అభ్యున్నతిపై బీద రవిచంద్ర సమావేశం

ఇటీవల అమరావతిలోని ఏపీ అసెంబ్లీ సమావేశం హాలులో శాసనసభ బీసీ సంక్షేమ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ చైర్మన్ బీద రవిచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు (నరసారావుపేట), మద్దులూరి మాలకొండయ్య(చీరాల), కందికుంట వెంకటప్రసాద్(కదిరి), కాగిత కృష్ణప్రసాద్(పెడన) పాల్గొని, బీసీల సంక్షేమానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల అమలుపై చర్చించారు. అసెంబ్లీ జాయింట్ సెక్రటరీ సుబ్బారెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ నాగముణెయ్య, బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రోటోకాల్ ఉల్లంఘిస్తున్నారు



వైకాపా కార్పొరేటర్లతో కలిసి కమిషనర్‌కి వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

వైసీపీ కార్పొరేటర్లను ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించకుండా.. అధికారులు ప్రోటోకాల్ ఉల్లంఘనకు.. పాల్పడుతున్నారంటూ వైసీపీ నాయకుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. ఆ విషయాన్ని ఇటీవల కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రోటోకాల్ ఉల్లంఘనలో అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన పలువురు వైసీపీ నాయకులతో కలసి కమిషనర్‌కి వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా, నెల్లూరులో డ్రైనేజీ కాలువల ఆధునీకరణలో.. పేదల ఇళ్ళు తొలగించకుండా పనులు చేపట్టాలని ఆయన కోరారు. మైపాడు గేటు వద్ద ఏర్పాటు చేసిన స్ట్రీట్ వెల్డింగ్ ప్రాజెక్ట్.. విఫలమైందని, అదేవిధంగా మళ్ళీ సర్వేపల్లి కెనాల్ వద్ద.. అదే ప్రాజెక్ట్‌ను తీసుకురావడం ప్రజాధన దుర్వినియోగమేనని ఆరోపించారు. నెల్లూరు మూలాపేట గర్ల్స్ హైస్కూల్ కాంపౌండ్ వాల్ వద్ద పేదలు ఏర్పాటు చేసుకున్న చిన్న చిన్న బంకలను.. నగరపాలక సంస్థ అధికారులు తొలగించాలని చూడడం దారుణమని పేర్కొన్నారు.



## అలరించిన.. లిటిల్ ఏంజెల్స్ వార్షికోత్సవం

గూడూరు మండలం, చిల్లకూరు, శారదనగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల 41వ వార్షిక దినోత్సవ వేడుకలు ఇటీవల ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ మనస్తత్వవేత్త, కెరీర్ కౌన్సెలర్ అభిషేక్ సింగంశెట్టి, కరస్పాండెంట్ బి.శ్రీకాంత్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ... గత 41 సంవత్సరాలుగా విద్యా రంగంలో అనేకమంది విద్యార్థులను అత్యుత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్ది, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడం జరిగిందని, తమ పాఠశాలలో కేవలం విద్య మాత్రమే కాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. కెరీర్ కౌన్సిలర్ అభిషేక్ సింగంశెట్టి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు వేరే పిల్లలతో పోల్చి తమ పిల్లలను తక్కువ చేసి మాట్లాడటం వలన వారిలో ఆత్మస్థైర్యం కోల్పోయే అవకాశం ఉందన్నారు. ప్రతి విద్యార్థిని తమ సొంత బిడ్డలా భావించి ఎల్.ఏ.పి యాజమాన్యం అత్యుత్తమమైన విద్యను అందిస్తున్నారని తెలియజేశారు. అనంతరం చదువుల్లో, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయిచరణ్, ప్రిన్సిపాల్ నమశివాయం, హెచ్‌ఎం సురేష్‌రెడ్డి, పి.టి.ఏ సెక్రటరీ ఎం.దయాకర్‌రెడ్డి, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకి సర్టిఫికెట్లను అందజేస్తున్న కెరీర్ కౌన్సిలర్ అభిషేక్ సింగంశెట్టి

### వీధి వ్యాపారులకు..
## 'మెప్మా' రుణాలు



చెక్కులు పంపిణీ చేస్తున్న మేయర్ రూప్‌కుమార్

ప్రధానమంత్రి స్వానిధి పథకంలో భాగంగా ఇటీవల నెల్లూరులోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు క్రెడిట్ కార్డులను, రుణాలను పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు, క్రెడిట్ కార్డులు అందజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచనల మేరకు పేదరిక నిర్మూలన కోసం వీధి వ్యాపారులకు ఆర్థిక భద్రతను కలిగించే దిశగా పీఎం స్వానిధి కార్యక్రమాన్ని రూపొందించారని, బ్యాంకుల ద్వారా వారికి రుణాలను అందజేసి వ్యాపారాలను విస్తరించేలా వివిధ కార్యక్రమాలను రూపొందించి విజయవంతంగా అమలుచేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. తాము తీసుకున్న రుణాల ద్వారా వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటూ సామాజిక, ఆర్థిక భద్రతలు పొందాలని ఆయన లబ్ధిదారులకు సూచించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ మాట్లాడుతూ, రుణాలు పొందిన వారు సకాలంలో తిరిగి చెల్లించి క్రెడిట్ స్కోర్ చక్కగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలని, అధిక మొత్తాన్ని మళ్ళీ బ్యాంకుల ద్వారా రుణంగా పొందే అవకాశాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ లీలారాణి, బ్యాంకర్లు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.



విఆర్‌సి వాకర్స్ అధ్యక్షుడిగా ఎన్నికైన నళిని మోహన్‌ని సత్కరిస్తున్న జె.వెంకటేశ్వర్లు, నేతాజీ సుబ్బారెడ్డి, లక్ష్మణ కుమార్‌రెడ్డి, అమ్మ ఫర్నిచర్ అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డి

### కాకర్ల ఆధ్వర్యంలో..
## లోకేష్ పుట్టినరోజు వేడుకలు



లబ్ధిదారులకి సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

టీడీపీ యువనేత నారా లోకేష్ పుట్టినరోజైన జనవరి 23న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా 87లక్షల రూపాయల విలువైన 115 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. తొలుత, మహిళలు ఆంగ్ల అక్షరాలతో నారా లోకేష్ పేరుతో మానవహారం నిర్వహించారు. మహిళల సంక్షేమంలో కీలక పాత్ర పోషిస్తున్న లోకేష్‌కి వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, తల్లికి వందనం, స్త్రీ శక్తి, ఉచిత గ్యాస్ పథకం, మెగా డీఎస్సీ ద్వారా లబ్ధి చేకూరిన ఉదయగిరి నియోజకవర్గంలోని మహిళలు లోకేష్ పుట్టిన రోజు వేడుకలలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేయడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా 'మై టీడీపీ యాప్' వినియోగించడంలో మొదటి స్థానంలో నిలిచిన ఆనంద్‌ని సన్మానించారు. అనంతరం సుమారు వెయ్యిమందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వింజమూరు ఎంపీపీ హైమావతి, సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, గూడా నరసారెడ్డి, మండలాల కన్వీనర్లు, అభిమానులు పాల్గొన్నారు.

## వీరజవానుల త్యాగాలు వెలకట్టలేనివి



ం‌ంటంటంటంఅశీబటటఎవ,ఎఅటశీఅవవసశ్రీ

దేశభక్తిలో తలవంచని ధీరులు, దేశ రక్షణలో వెనకడుగు వేయని వీరులు, మన వీరజవానుల ధైర్యసాహసాలు, త్యాగాలు వెలకట్టలేనివని, దేశం కోసం ప్రాణాలను పణంగాపెట్టి పోరాడే వారి దేశసేవ అమూల్యమని జిల్లా రెవిన్యూ అధికారి విజయకుమార్ చెప్పారు. వీర జవానుల సేవలను స్మరిస్తూ, ఈనెల 28న జాతీయ మాజీ సైనికుల దినోత్సవం(వేషనల్ వెటరన్స్ డే)ను నెల్లూరు నగరంలోని తిక్కన ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, వీరజవానుల గొప్పతనాన్ని వివరించారు. 1965, 1971 యుద్ధాలు మరియు 1999 ఆపరేషన్ విజయ్‌లో పాల్గొన్న సైనికుల అసమాన ధైర్యసాహసాలను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. దేశ రక్షణలో వారి త్యాగం ఎనలేనిదని, అటువంటి వీరులను గౌరవించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ఈ సందర్భంగా, జిల్లాలోని 70 సంవత్సరాలు దాటిన 30 మంది మాజీ సైనికులను ఆయన సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.హరికృష్ణ, అఖిల భారతీయ పూర్వ సైనిక సేవా సమితి రాష్ట్ర కార్యదర్శి మాజీ వింగ్ కమాండర్ శ్యాంప్రసాద్, నెల్లూరుజిల్లా మాజీ సైనికుల అసోసియేషన్ అధ్యక్షులు కరేటి కళాధర్, ఉపాధ్యక్షులు మేడేపల్లి రత్నయ్య, కావలి అసోసియేషన్ అధ్యక్షులు రాజారావు, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు, సైనిక్ భవన్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడాస్ఫూర్తితో రాణించాలి



క్రీడాకారులతో వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి

రాష్ట్రంలోనే తొలిసారిగా సచివాలయ వార్డు ఉద్యోగుల జేఏసీ ఏర్పాటు చేసి వార్షిక క్రీడలు ప్రారంభించడం అభినందనీయమని టీడీపీ నాయకుడు.. నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈనెల 28న నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మున్సిపల్ కార్పొరేషన్ సచివాలయ వార్డు ఉద్యోగుల వార్షిక క్రీడా సంబరాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ దామవరపు రాజశేఖర్‌తో కలిసి ఆయన పాల్గొని క్రీడాకారులను అభినందించారు. ఉద్యోగులు క్రీడా స్ఫూర్తితో రాణించాలని సూచించారు. మంత్రి నారాయణ సహకారంతో రాష్ట్రంలోనే తొలిసారిగా జేఏసీ ఆధ్వర్యంలో నెల్లూరులో ఈ క్రీడా పోటీలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. విధి నిర్వహణలో ఒత్తిడిని తగ్గించుకునేందుకు కొంత సమయం క్రీడల కోసం కేటాయించాలన్నారు. అనంతరం త్రోబాల్ క్రికెట్ క్రీడాకారులను అభినందించారు.

## మహనీయుల త్యాగాలతోనే
# దేశానికి స్వాతంత్ర్యఫలాలు


జెండా వందనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహనీయుల త్యాగాలతోనే మనకు స్వాతంత్ర్యఫలాలు లభించాయని, వారి దేశభక్తి తరతరాలకి స్ఫూర్తిదాయకమని నెల్లూరులోని కాంగ్రెస్ నాయకులు స్మరించుకున్నారు. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఇందిరాభవన్‌లో వేడుకలు నిర్వహించి స్వాతంత్ర్యయోధులకి నివాళులర్పించారు. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉడత వెంకట్రావుయాదవ్ జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. అందరికీ మిఠాయిలు పంచి రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాల సుధాకర్, ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రెహమాన్, అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## స్పాస్టిక్ సెంటర్‌లో.. నేతాజీ జయంతి


నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

నెల్లూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలోని ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్లో ఈనెల 23న నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, స్పాస్టిక్ సెంటర్ కో-ఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్ పాల్గొని నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా దేశ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం నేతాజీ చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపాల్ ఎం.ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# విపిఆర్ విరాళాలు

## 'ఇస్కాన్' మందిరానికి 6 లక్షలు...

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(విపిఆర్) తన సామాజిక, ఆధ్యాత్మిక సేవల్లో భాగంగా ఈనెల 28న నెల్లూరులోని ఇస్కాన్ మందిరం వారికి 6 లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఈనెల 31న నెల్లూరులో ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర జరుగనుంది. ఈ కార్యక్రమానికి వచ్చే భక్తులకు భోజనవసతి కల్పించేందుకు విపిఆర్ సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నెల్లూరులోని తమ నివాసంలో ఆ విరాళం చెక్కును ఇస్కాన్ ప్రతినిధికి అందజేశారు.

## ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రానికి 5 లక్షలు...

ఉదయగిరిలోని చెక్క నగిషీ కేంద్రానికి ఎంపీ వేమిరెడ్డి ఇటీవల 5లక్షల రూపాయలను ఆ కేంద్రం నిర్వాహకుడు జాకీర్‌హుస్సేన్‌కి అందజేశారు. ఈ కేంద్రంలో తయారయ్యే వస్తువులు కళాకారుల హస్తకళా నైపుణ్యానికి ప్రతీకలుగా ఉంటాయి. ఆ కేంద్రానికి తగు వసతులు లేకపోవడంతో దాని అభివృద్ధికి చేయూతనిస్తామని వేమిరెడ్డి గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఈ విరాళం అందజేశారు.

## నిరుపయోగ వస్తువులతో.. నిత్యావసరాలు!

ప్రజలు తమ వద్ద ఉన్న నిరుపయోగ వస్తువులతో నిత్యావసరాలు అందుకునేందుకు వీలుగా వీపీఆర్ దంపతులు ఇటీవల వినూత్న కార్యక్రమం ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ఇళ్లలో పనికిరాని వస్తువులు, బయట పారేసే ప్లాస్టిక్ కవర్లు, అట్ట పెట్టెలు, వాటర్ బాటిల్స్ వగైరాలు తాము ఏర్పాటుచేసిన 'స్వచ్ఛ రథం' సిబ్బందికి అందజేస్తే, వారికి అవసరమైన నిత్యావసర సరుకులు అందజేసేవిధంగా ఏర్పాటుచేశారు. వారానికి రెండుసార్లు ఈ వాహనం గ్రామానికి వస్తుంది. కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట, కోవూరు మండలాలను అందుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు.

## నరేంద్రబాబుకు.. పురస్కారం



నెల్లూరు వెంగళరావునగర్ మునిసిపల్ హైస్కూలులో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గుండాల నరేంద్రబాబు జనవరి 26న జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ నుంచి విశిష్ట సేవా పురస్కారాన్ని అందుకున్నారు. 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసిలో కేర్ టేకర్ ఆఫీసర్‌గా, థర్డ్ ఆఫీసర్, సెకండ్ ఆఫీసర్ హోదాలలో కూడా ఆయన పని చేస్తున్నారు.

# 'అంతరంగ ద్వీపం'.. ఓ చైతన్యపు కవితా దీపం

నిరంతర కవితా కృషికి నిలువెత్తు ఆనవాలు పార్లపల్లి నాగేశ్వరి కవితలు. ఆమె కవితలు చైతన్య దీపికలు. నవ్వుల ఆభరణం. ప్రతి అంశాన్ని కవితగా మలిచిన తీరు ఆమె విలక్షణ కవితా ప్రతిభకు ప్రతీకలుగా కనిపిస్తాయి. అందుకే, 'అంతరంగ ద్వీపం'లోని అనేక కవితలు పాఠకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

అమ్మని ప్రేమించని వాడు ఎవరూ ఉండరు. అమ్మ నీడలో సేదదీరడం మనిషికే కాదు ప్రతి ప్రాణికీ ఉన్న అలవాటే. నాన్న అన్పించుకోనేకంటే అమ్మ అన్పించుకోవడమే ఒక అదృష్టం, ఒక వరం. అందుకే ఆమె తొలి కవిత అమ్మపై సాగింది. అమ్మతో బాటు నాన్నను కూడా ప్రతిష్టింపజేసుకొంది. అమ్మ ఇచ్చింది మనకు జీవం / నాన్న నేర్పాడు జీవన విధానం.. అంటూ పిల్లల హృదయాల్లో ముద్రవేసే తల్లితండ్రు లపై, వారు అందించే వికాసదీప్తిపై కవితా నిర్మాణం సాగింది. 'మా నాన్న నిజాయితీకి నిలువెత్తు తార్కాణం' అని చెప్పూ, నాన్న బాటలోనే సాగింది నా పయనం. ఆయన 'జీవన విధానం స్ఫూర్తిదాయకం, ప్రేరణదాయకం' అంటూ తనకు మార్గ దర్శకులు అమ్మానాన్నలే అని స్పష్టం చేసింది.

మా ఊరు 'పంట పొలాల దృశ్యకావ్యం / పాలధారల నిలయం / పొగాకే మా ఊరికి పచ్చలహారం / పండించే రైతు మా ఊరికి మణిహారం'.. అంటూ 'పొగాకు పచ్చలహారం' అంటూ కవితామయంగా సాగిన ఈ కవిత చక్కగా సాగింది. పల్లె పట్టు వివిధ రకాల వృత్తుల వాళ్ళను పరిచయం చేయడం వినూత్న సంవిధానం. 'నా మౌనం' కవితలో నా మౌనం కాదు శూన్యం / ఎవరి ఊహలకు అందని కార్యాచరణం నా మౌనం / నా మౌనం ఏకాగ్రతకు ప్రకృతి చికిత్స అంటూ ఆమె మౌనం ఏకాగ్రతకు ప్రకృతి చికిత్సగా భావించడం అంతర్లీనంగా మౌనాన్ని పరిశీలనకు ఒక ఆయుధంగా సూచిస్తుందామె. తెలుగు భాష తనకు 'ఇలవేల్పు'గా పేర్కొంటూ చక్కని కవితను అందించారామె. 'ఉషోదయపు తుషార బిందువై వెలుగు నా తెలుగు / మన వేమన శతకాలు పచ్చలపతకాలు' అంటూ తెలుగు భాషపై మక్కువను చాటారు. 'తలకట్టు కలిగి / తలెత్తుకు తిరిగేలా' చేసిందట తెలుగు భాష. ఎంతటి విలువైన భావనో మరి. 'అజంత భాష మన అంతరంగ భాష' అంటూ హృద్యమైన తెలుగును మహనీయంగా వెల్లించారు. 'దాస్య బ్రతుకులకన్నా బలవంతపు మరణం మిన్న' అని గర్జించిన స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ త్యాగాన్ని అభిషేకించారామె. 'ఆంగ్లేయుల పాలనలో అణచబడ్డ జనం' అని ఆక్రోశిస్తూ దాస్యాన్ని తరిమికొట్టిన మన కొదమసింహం / మన ఉయ్యాలవాడ జయహోనని జయ జయ ధ్వానాల మధ్య, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి శౌర్య ప్రతాపాల్ని కీర్తించి మనల్ని ఉద్యుక్తుల్ని చేస్తారామె. విశ్వాస ఘాతుకులకి బలి అయిన సూర్యుడా అని వేనోళ్ళ ప్రశంసిస్తారామె. 'ప్రకృతిలోని ప్రతి సవ్వడి సంగీతమే / ఆస్వాదిస్తే నిశ్శబ్దం కూడా మాధుర్యమే'నంటూ 'శబ్ద శిల్పము' కవితలో గొప్ప భావాన్ని మన ముందుంచుతారామె. ఇది 'వర్డ్స్‌వర్త్' భావజాలాన్ని పోలిన గొప్ప రచన. ప్రకృతి సవ్వడి సంగీతమేనని చెప్పడం ఓ ఎత్తైతే, ఆస్వాదిస్తే నిశ్శబ్దం కూడా సంగీతమేనని అభివర్ణించిన తీరు అభినందనీయం. మరో గొప్ప కవిత 'రూపాయి దేవుడు'. రూపాయి మనిషి జీవనాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది, మనిషి గమనాన్ని ఎలా తీర్చిదిద్దుతుంది లాంటి ఆవిష్కరణలు చేస్తారామె. 'డబ్బుంటే సుబ్బమ్మే సుబ్బలక్ష్మి' అనే సినిమా పాట మనం విన్నాం. 'ధనమేరా అన్నిటికీ మూలం.. ఆ ధనం విలువ తెలుసుకొనుట మానవ ధర్మం'. రెండు కోణాల్లోనూ రూపాయిని ఆవిష్కరించి అటు రూపాయి ప్రాధాన్యాన్ని, రూపాయి ప్రాబల్యం మనిషిలో మార్పును రెండిటినీ విశదీకరించిన కవిత ఇది. రూపాయిని పేదలకు పంచమని కూడా ఆమె తన మాటగా చెప్తారు. 'వీలునామా' కవితలో పెద్ద తరాన్ని గూర్చి సాంప్రదాయ ఖజానా గాను, నైతిక విలువల వీలునామాగానూ చెప్పిన తీరు ప్రశంసనీయం. 'వయసు వసంతాన్ని వారసులకి ఇచ్చి / గ్రీష్మానికి ఘనమైన ఆహ్వానం పలికే నిస్వార్థ తరాల వారే మన సంస్కృతికి సారథులు.. వారథులు' అని భారతీయ సంస్కృతికి జేజేలు అంటారామె ఒక కవితలో. ఇలా ప్రతి కవితలో వస్తు వైవిధ్యం, సమాజానికి సందేశం ఇవ్వాలనే తాపత్రయంతో నిండింది. ఈ కవయిత్రి అభివ్యక్తిని మరింత మెరుగుపరుచుకొని నెల్లూరుకు బలమైన కవయిత్రిగా 'నారి యుద్ధభేరి' మ్రోగించగలదని ఆకాంక్ష.




రచన:
**పార్లపల్లి నాగేశ్వరి**
సెల్: 73869 99490
వెల: 250/- పేజీలు: 198
ప్రతులకు:
పార్లపల్లి నాగేశ్వరి
నెల్లూరు.



**చిన్ని నారాయణరావు**
94402 02942

## టూకీగా...



### రామసాగరంలో రైతులకు అవగాహన

సైదాపురం మండలంలోని రామసాగరంలో రైతులకు వ్యవసాయ అధికారులు ఈనెల 28న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి పలు పథకాలపై అవగాహన కలిగించారు. అన్నదాత సుఖీభవ డబ్బులను అందుకోవాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ నంబరును తప్పనిసరిగా పొందాలంటూ, నంబరు రిజిస్ట్రేషన్ ఎలా చేయించుకోవాలో తెలిపారు.

### సీతారామపురం ఆదర్శపాఠశాల తనిఖీ

మండల కేంద్రమైన సీతారామపురం (ఎస్ఆర్ పురం)లోని ఆదర్శ పాఠశాలను ఈనెల 28న డిప్యూటీ డీఇఓ జానకి రామయ్య తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, విద్యార్థుల హాజరును ఆరా తీశారు. పాఠశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత, బోధన, వసతులు వగైరాలన్నిటినీ పరిశీలించి, విద్యార్థులు మంచి ఉత్తీర్ణతలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు.

### కోవూరులో ఎంపీడీఓ టెలీకాన్ఫరెన్స్

కోవూరు మండలంలోని అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులతో ఎంపీడీఓ శ్రీనివాసులు ఈనెల 27న టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, పన్నుల వసూళ్ళు ఏ విధంగా జరుగుతున్నాయో ఆరా తీశారు. ఫిబ్రవరి 15లోగా నూటికి నూరుశాతం పన్నులు వసూలుచేసేందుకు కృషిచేయాలని చెప్పారు. డిప్యూటీ ఎంపీడీఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### వెంకట్రావుపల్లిలో పేరెంట్స్ - టీచర్స్ సమావేశం

ఉదయగిరి మండలంలోని వెంకట్రావుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 27న పేరెంట్స్-టీచర్స్ సమావేశం జరిగింది. విద్యార్థులు చదువుకి సంబంధించిన అంశాలను చర్చించారు. ప్రధానోపాధ్యాయుడు చల్లా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు ఎం.బలరామయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో విద్యార్థులతో పాటు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

### పడమటి కంభంపాడులో 'పొలం పిలుస్తోంది'

అనంతసాగరం మండలం పడమటి కంభంపాడులో ఈనెల 27న మండల వ్యవసాయాధికారులు రైతులకు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి, వరి పొలాల సాగు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను, మెళకువలను వివరించారు. మండల వ్యవసాయ అధికారిణి ఇ.శైలజాకుమారి, వ్యవసాయ విస్తరణాధికారిణి కె.కృష్ణవేణి, వీపిఏ జ్యోత్స్న పాల్గొన్నారు.

### సంగంలో జడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం

మండల కేంద్రమైన సంగంలోని జడ్పీ హైస్కూల్‌లో ఈనెల 27న వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీరావు పాల్గొని, విద్యార్థులంతా బాగా చదువుకుని మంచి ఉత్తీర్ణతలు సాధించాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య, డిప్యూటీ డీఇఓ జానకిరామ్, ఎంఇఓ మల్లయ్యతో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### గాదెలదిన్నెలో పశువైద్య శిబిరం

వివలలూరు మండలంలోని గాదెలదిన్నెలో ఈనెల 27న పశువైద్యుడు డాక్టర్ బి.గౌతమ్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. రైతులకు ప్రభుత్వం 85 శాతం రాయితీతో పశుబీమా కూడా అందిస్తోందని తెలిపారు. పశువ్యాధుల పట్ల యజమానులు అప్రమత్తంగా ఉంటూ వాటికి ఎప్పటికప్పుడు ఆరోగ్యపరీక్షలు చేయించాలన్నారు.

### ఏఎస్‌పేటలో దోమల నివారణకు ఫాగింగ్

మండల కేంద్రమైన ఏఎస్‌పేటలో ఈనెల 28న దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. సర్పంచ్ షేక్ తాజ్‌ఉన్నీసా జలాని ఆధ్వర్యంలో దర్గా సెంటర్, తూర్పువీధి, నగర్‌ఖానా సెంటర్, హైస్కూల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఫాగింగ్ యంత్రాలతో ఈ కార్యక్రమం చేపట్టారు.

### వింజమూరు రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

వింజమూరు ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ అదుపుతప్పి బుక్కాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. కలిగిరి సీఐ వెంకటనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చుక్కల లోకంలో.. చక్కర్లు కొడుతున్న

# ‘బంగారు - వెండి’



**బంగారు, వెండి ఇప్పుడు భూమ్మీద లేవు. ఏడాది క్రితం వరకు కొద్దో గొప్పో అందుబాటులో విహరిస్తుండేవి. కానీ, ఇప్పుడు ఏకంగా చుక్కల లోకంలోకి వెళ్ళిపోయాయి. ఒకదానితో మరొకటి పోటీపడుతూ వీటి ధరలు రోజురోజుకీ పైపైకి ఎగబాకుతున్నాయి.**

అనాదిగా మన భారతీయులు, ముఖ్యంగా మహిళలకి బంగారు ఆభరణాలు కొనుక్కోవడం ఆనవాయితీ. ఎవరి స్థోమతకి తగ్గట్లుగా వాళ్ళు బంగారంపై ఎక్కువ మక్కువ పెంచుకునేవాళ్ళు. ఇక పుట్టిన బిడ్డకి సైతం బంగారు మొలతాడు లేదా కనీసం వెండి మొలతాడైనా చేయించుకోవడం రివాజు. ఇక ఆర్థిక పరిస్థితిని బట్టి ఇళ్లలో వెండి సామాను వాడకం కూడా అనాదిగా వస్తున్న ఆచారమే. పూజగదిలో వాడే సామాగ్రితో పాటు, అన్నం తినే పళ్ళెం కూడా చాలామంది వెండివే వాడుతుంటారు. అతి సామాన్యుల నుండి ధనవంతుల వరకు అత్యధికశాతం భారతీయుల వద్ద ఎంతోకొంత బంగారం ఉండడం సర్వసాధారణం. తమ చేతిలో బంగారం ఉంటే అదొక భరోసాగా భావించేవాళ్ళు. ఆడపిల్ల పుడితే రూపాయి రూపాయి కూడబెట్టయినా బంగారు కొనడం మన దేశంలో ఒక సంస్కృతిగా పెట్టుకున్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితులలో ఆదుకునేది కూడా ఆ బంగారమే అన్న భావన చాలామందిలో ఉంటుంది. అందుకనే ఏమాత్రం నాలుగు రూపాయలు పోగైనా వెంటనేదానిని బంగారు రూపంలోకి మార్చేస్తారు.

దీంతో తొలినుంచి బంగారానికి కొంచం డిమాండ్ ఎక్కువే. డిమాండుకి తగ్గట్లుగా ధరలు కూడా అదే రీతిలో ఉండేవి. అయితే, వెండి ధరలు మాత్రం అందరికీ అందుబాటులో ఉండేవి. అందుకోసమే బంగారాన్ని గ్రాములతో కొలిస్తే, వెండిని కిలోలతో కొలుస్తారు. ఇప్పుడా రోజులు పోయాయి. బంగారం, వెండి ధరలు జెట్ స్పీడుతో పెరిగిపోతున్నాయి.

‘అయ్యబాబోయ్.. వాటిని మనం కొనగలమా’..? అని మధ్యతరగతి వారే కాకుండా, ధనవంతులు సైతం వణికిపోయే స్థాయిలో వాటి ధరలు అంతకంతకు పెరుగుతున్నాయి.

తాజగా.. ఈనెల 29 గురువారం నాటికి బంగారం, వెండి ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక్కసారిగా ఊహించనంత స్థాయికి చేరుకున్నాయి. మన దేశంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,83,328 రూపాయలకి చేరుకుంది. అంటే, ఇప్పుడు బంగారం కొనాలంటే లక్షలుంటే తప్ప కుదరదన్న మాట. బంగారం ఇంతగా పెరగడం తమ జీవితకాలంలో ఎప్పుడూ వినలేదు, చూడలేదు అని పెద్దలు సైతం విస్తుపోతున్నారు. కేవలం రెండేళ్ళ కాలంలో రెండింతలుగా బంగారం ధర పెరగడం బహుశా ఇదే తొలిసారెమో..!.

**బంగారు, వెండి తాజా ధరలు:**

**జనవరి 29వ తేదీ గురువారం నాటికి**
**10 గ్రాముల 24 క్యారెట్ల బంగారు ధర**
**రూ. 1,83,328/-**
**వెండి ధర కిలో రూ. 4,25,000/-**

### నాలుగింతలు పెరిగిన వెండి!

వెండి సైతం తానేమీ తక్కువ తినలేదంటూ, సామాన్యులకి అందనంత స్థాయికి వెళ్లిపోయింది. కేవలం ఏడాది వ్యవధిలో నాలుగింతలు రెట్టింపు అయ్యింది. గురువారానికి సరికొత్త రికార్డులు సృష్టించుకుంటూ వెండి కిలోధర ఏకంగా 4,25,000లకి చేరిపోయింది. వేలల్లో ఉండే వీటిధరలు ఇప్పుడు లక్షల్లోకి వెళ్లిపోయాయి. ఇవి ఇంకా పెరిగే అవకాశం కూడా ఉందని వాణిజ్యవేత్తలు అంచనా వేస్తున్నారు. ప్రపంచం ఇప్పుడు మునుపటిలా లేదు. శాంతి లేదు, సౌఖ్యమూ లేదు, అంతా అశాంతే. యుద్ధాలు, మారణహోమాలు, ఆగ్రహాలతో భూగోళం భగ్గుమంటోంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగుతూనే ఉండడం, అంతర్జాతీయ రాజకీయాల్లో నెలకొన్న అస్థిరత, ఇజ్రాయెల్, పాలస్తీనా ఉద్రిక్తతలు, ఇవన్నీ చాలవన్నట్లు కొత్తగా అమెరికా విధిస్తున్న సుంకాలు, పెరుగుతున్న డాలర్ ధర, పలు దేశాల మధ్య ఆధిపత్యపోరు వగైరా కారణాలన్నీ కలిసి బంగారం, వెండి వంటి లోహాలకి బాగా డిమాండ్ ఏర్పడి, వాటిధరలు ప్రపంచమార్కెట్‌నే బెంబేలెత్తించే స్థాయికి చేరుకున్నాయి.

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేటి పరిస్థితుల్లో ఎంతో కొంత సురక్షిత పెట్టుబడి సాధనాలుగా ఉండేది బంగారం, వెండి మాత్రమే. దీంతో వీటి ధరలు గగనవిహారం చేస్తున్నాయి. పసిడి కంటే వెండి ధరలు మరింతగా మిడిసి పడుతుండడం మరీ విచిత్రం!.. కిలో వెండి అక్షరాల 4 లక్షలా 25వేల రూపాయలు పలుకుతోందంటే ఏమనుకోవాలి?..ఇవన్నీ ఈ వార్త రాసేరోజు ధరలు మాత్రమే. రేపటికి మరెంతగా విజృంభిస్తాయో చెప్పలేం. మరోవైపు ప్రపంచం గ్రీన్ ఎనర్జీవైపు అడుగులు వేస్తోంది. సౌర విద్యుత్ రంగం పుంజుకోవడంతో వెండికి మరింత డిమాండ్ వచ్చేసింది. విద్యుత్ వాహనాల్లో కూడా వెండి వాడకం ఎక్కువగా ఉంటోంది. అవసరానికి తగ్గ వెండి నిల్వలు లేకపోవడంతో ధరలిలా అనూహ్యంగా పెరిగిపోతూనే ఉంటాయని వాణిజ్య నిపుణుల విశ్లేషిస్తున్నారు. అనాదిగా మానవజీవితంలో కలగలసిపోయిన ఈ రెండు లోహాలు, ఇప్పుడు సామాన్యులు వాటివైపు కన్నెత్తి చూడలేనంత స్థాయికి చేరిపోయాయి. బంగారం గ్రాము 20,000 దాటిపోతుందని, అదే విధంగా వెండి కిలో 7,00,000లకి చేరుకుంటుందని బంగారు, వెండి వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఊహించని స్థాయిలో ఈ రెండు లోహాలు పెరిగిపోతుండడంతో, కోట్లరూపాయలు నల్ల ధనం మూలుగుతున్న ధనవంతులు బంగారు, వెండిపైన పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నారని వ్యాపారులు చెప్తున్నారు. ముఖ్యంగా డిమాండుకి తగ్గట్లుగా, బంగారు బిస్కట్లని, వెండిని బ్లాకులని అందించలేకపోతున్నామని అంటున్నారు. పరిస్థితిచూస్తుంటే ఈ ధరలు ఇప్పట్లో తగ్గేలా లేవని కూడా చెప్తున్నారు. ఎన్నో వింతలు, విడ్డూరాలు, సునామి వంటి ప్రకృతి విపత్తులు, కరోనా వంటి మహమ్మారులు చూసిన ఈ తరం జనానికి ఇప్పుడు కన్ను మూసి తెరిచేలోగా అమాంతం పెరుగుతున్న బంగారం, వెండి ధరలని చూడడం కూడా ఓ కొత్త అనుభూతే కదా..!



## చెన్నై ఐఐటిని సందర్శించిన బీఎంఆర్

రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు(బీఎంఆర్) ఈనెల 27న చెన్నైలోని ఐఐటిని సందర్శించారు. అక్కడి డైరెక్టర్, వైస్‌చాన్సలర్‌ను, డీన్‌లను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా డ్రోన్స్ మరియు సెమీకండక్టర్ ప్రాజెక్టుల అభివృద్ధి, పరిశోధన అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం ఐఐటి ప్రాంగణంలోని డ్రోన్స్ ఇన్క్యుబేషన్ సెంటర్‌ను సందర్శించి, అక్కడ జరుగుతున్న ఆవిష్కరణలును, సాంకేతిక పురోగతిని ఆయన పరిశీలించారు.

## వైసీపీ పాలనలో.. భూ రికార్డులు అతలాకుతలం!

గత వైసీపీ పాలనలో భూ రికార్డులు అతలాకుతలం అయ్యాయని, రీసర్వేలో చేసిన పాపాలతో రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. గ్రామాలకు గ్రామాలను 22ఏలో పెట్టేశారని, ఇప్పుడు తొలగించేందుకు అధికారుల పాట్లు చెప్పనలవి కాకుండా ఉన్నాయని అన్నారు. ఇటీవల అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఒక దుర్మార్గమైన చట్టమని, దాన్ని జగన్‌రెడ్డి



**- ఎమ్మెల్యే సోమిరెడ్డి విమర్శ**

ప్రభుత్వం ప్రజలపై బలవంతంగా రుద్దిందని దుయ్యబట్టారు. తాతలు ఇచ్చిన ఆస్తులపై జగన్ రెడ్డి ఫొటోలు వేయడం ఏమిటని, దానికి కూడా ప్రజల సొమ్ము వందల కోట్లు ఖర్చు పెట్టడం ఎందుకనే విమర్శలు అప్పట్లో వెల్లువెత్తినా పట్టించుకోలేదన్నారు. బ్రిటీష్ పాలనలో కూడా ఇంతటి ఘోరమైన చట్టాలు రాలేదని, వాళ్ళు పన్నులు కట్టించుకున్నారు కానీ భూములు ఇలా బలవంతంగా లాక్కోలేదని అన్నారు. 2019-24 మధ్య వైసీపీ వాళ్ళు నియంత పోకడలతో వ్యవహరించి ప్రజలను బాధించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజలకు ఆ బాధల నుండి విముక్తి కలిగించిందన్నారు.

## ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి!

### కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకి ధైర్యం చెప్పిన కలెక్టర్

కరోనా సమయంలో తల్లితండ్రులన కోల్పోయిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ స్ఫూర్తినిచ్చారు. ఎన్ని కష్టాలు వచ్చినా సరే..ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, మనల్ని బలమైన వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకే జీవితంలో కష్టాలు వస్తాయని చెప్పారు. ఆత్మస్థైర్యంతో ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని తెలిపారు. విద్యార్థుల జీవితాలకు ఉపయోగపడేలా మంచిమాటలను, స్ఫూర్తిదాయకమైన రీతిలో చెప్పి, వారిలో కొత్త ఆశలను చిగురింపజేశారు. చదువు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఎంతటి పరిస్థితినైనా జయించవచ్చని ధైర్యం చెప్పారు. బుధవారం తన చాంబర్‌లో ఆ విద్యార్థులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమై, వారితో ఆత్మీయంగా మాట్లాడారు. విద్యార్థులను పేరుపేరునా పలకరించిన కలెక్టర్, వారి చదువు, ఆరోగ్యం, భవిష్యత్



లక్ష్యాలు, ఎదురవుతున్న ఇబ్బందులపై ఆత్మీయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయానికి సంబంధించిన పోస్టాఫీసు పాస్‌పుస్తకాలను, సర్టిఫికెట్లను విద్యార్థులకు అందజేశారు. కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన జిల్లాలోని 24 మంది విద్యార్థులకు పీఎం కేర్స్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.10 లక్షలు చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించి, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థుల పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సంబంధిత పోస్టాఫీసు పాస్‌పుస్తకాలను కలెక్టర్ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనా సుజన్, బాలల సంరక్షణాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com